PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 306 | విజయవాడ, ఆదివారం 8 జూన్ 2025 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 8 June 2025 | Rs

భారత్‌లోకి స్టార్‌లింక్‌ను అనుమతించొద్దు

- అనుమతులను తక్షణమే రద్దు చేయాలి
- సిపిఎం డిమాండ్

5




ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ టైటిల్‌ను అమెరికా యువ సంచలనం, 2వ సీడ్ కోకా గాఫ్ చేజిక్కించుకుంది. రొలాండ్ గారోస్‌లో శనివారం జరిగిన ఫైనల్లో గాఫ్ 6-7(5-7), 6-2, 6-4తో టాప్‌సీడ్, బెలారస్‌కు చెందిన అర్యానా సబలెంకపై విజయం సాధించింది. దీంతో 21ఏళ్ల గాఫ్ కెరీర్‌లో 2వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకుంది.

6

14లోపు తల్లికి వందనం

- ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
- టిడిపి నేతలతో చంద్రబాబు
- ఏడాది పాలనపై విజయోత్సవ ర్యాలీలకు పిలుపు

ఈ నెలలోనే 'అన్నదాతా...సుఖీభవ'



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తల్లికి వందనం పథకాన్ని ఈ నెల 12న గానీ, 14వ తేది లోపుగాని అమలుచేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అన్నారు. టిడిపి మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలతో శనివారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌సిక్స్‌తో పాటు మ్యానిఫెస్టో అమలు గురించి ఆయన ప్రస్తావించారు. తల్లికి వందనం పథకంలో భాగంగా ఇచ్చే నగదును 14వ తేదిలోపు లబ్ధిదారులకు అందచేస్తామని చెప్పారు. తల్లికి వందనంతో పాటు అన్నదాత సుఖీభవ పథకాన్ని కూడా ఈ నెలలోనే అమలు చేస్తామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ఆగస్టు 15 నుంచి అమలు చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడి ఈ నెల 12వ తేదికి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ఆ రోజు రాష్ట్ర వ్యాప్తంగా విజయోత్సవ ర్యాలీలు నిర్వహించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోనూ ఈ ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. అదేరోజు కూటమి ఎంపిలు, ఎమ్మెల్యేలతో అమరావతిలో సమీక్షా సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏడాదిలో స్పష్టమైన మార్పు చూపించినట్లు చెప్పారు. ఈ కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు. గత పాలకులు విధ్వంసం చేసిన రాష్ట్రాన్ని సర్వశక్తులు ఒడ్డి ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పనితీరు, పార్టీలో ప్రతి ఒక్కరి పనితీరుపై సర్వేలు చేయిస్తున్నామని, ప్రతి సమాచారాన్ని తెప్పించు కుంటున్నామని చెప్పారు. కొన్ని సందర్భాల్లో అడ్మినిస్ట్రేషన్‌లో తప్పులు వల్ల, అధికారుల తీరు వల్ల కూడా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని, మంత్రులు ఈ విషయంలో మరింత బాధ్యతగా ఉండాలని సూచించారు.

వన్‌టైం ఎమ్మెల్యేలుగా మిగిలిపోకూడదు

మొదటి సారి గెలిచిన ఎమ్మెల్యేలు వన్ టైం ఎమ్మెల్యేలుగా మిగిలిపోకూడదనేది తన ఆలోచన అని చంద్రబాబు అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచామనే అతి విశ్వాసానికి పోతే వారికే ఎక్కువ నష్టమని జరుగుతుందన్నారు. ప్రతి ఆరు నెలలకొకసారి ఎంపిలు, ఎమ్మెల్యేల పనితీరుపై సర్వేలు చేసి నివేదికలు తెప్పించుకుంటున్నట్లు వెల్లడించారు. మెజార్టీ ఎమ్మెల్యేలు, ఎంపిలు తమ పనితీరుతో ప్రజలకు దగ్గరయ్యారని, వీరి వల్ల పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు వస్తోందన్నారు. ఒకరిద్దరు వల్ల అక్కడక్కడా నష్టం కూడా జరుగుతోందని చెప్పారు. మంచి చేస్తే అభినందించి ప్రోత్సాహించి అవకాశాలు కల్పిస్తానని చెప్పారు. తప్పు చేస్తే మాత్రం దూరం పెడతానని, ఇందులో రాజీలేదని, దీనిని బాగా అర్థం చేసుకోవాలని చెప్పారు. ఏ ఒక్క వ్యక్తి చర్యల వల్ల వ్యవస్థకు నష్టం జరుగుతున్నా అంగీకరించబోనని పేర్కొన్నారు. త్వరలో ఒక్కో ఎమ్మెల్యేతో ముఖాముఖి భేటీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫలితాలను ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా శనివారం విడుదల చేశారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 46 శాతం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 63 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం జనరల్ పరీక్షకు 1,27,182 మంది హాజరవ్వగా, 57,400 (45 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్‌లో 13,690 మంది హాజరవ్వగా, 6,725 (49 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 87,793 మంది హాజరవ్వగా, 55,210 (63 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ విభాగంలో 10,170 మందికి 6,777 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరంలో బాలికలు 49 శాతం, బాలురు 43 శాతం, ద్వితీయ సంవత్సరంలో బాలికలు 64 శాతం, బాలురు 63 శాతం ఉత్తీర్ణులయ్యారు. తొలి సంవత్సరం ఇంప్రూవ్‌మెంట్ జనరల్ విభాగంలో 2,30,303 మంది రాయగా, 1,90,038 మందికి మార్కులు పెరిగాయి. జనరల్ విభాగంలో 5,659 మంది రాయగా, 1,705 మందికి మార్కులు పెరిగాయి. సప్లిమెంటరీతో కలుపుకుని 2024-25 విద్యా సంవత్సరంలో ప్రథమ సంవత్సరం ఉత్తీర్ణత 82 శాతం, ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణత 93 శాతంగా నమోదైంది.

బనకచర్లపై అఖిలపక్షం

సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి బ్యూరో- అమరావతి

ప్రతిపాదిత పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై అఖిలపక్ష సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'గోదావరి, కృష్ణా నదుల అనుసంధానం పేరుతో పోలవరం నుండి బనకచర్ల వరకు రూ.82 వేల కోట్లతో చేపట్టబోయే అతి భారీ ప్రాజెక్టుపై రోజుకోరకంగా వస్తున్న వివరణలు గందరగోళ పరుస్తున్నాయి. ఈ ప్రాజెక్టు ప్రతిపాదన వచ్చిన నాటి నుండి ఇంజినీర్లు, రైతు సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు, మేధావులు, పలువురు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. అయినా ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎటువంటి సంతృప్తికరమైన వివరణ రాలేదు. తాజాగా ముఖ్యమంత్రి ఈ ప్రాజెక్టును హైబ్రిడ్ యాన్యూటి (హమ్) స్కీమ్ కింద చేపట్టబోతున్నట్లుగా చేసిన ప్రకటన అనుమానాలను మరింతగా బలపరుస్తోంది. ఈ ప్రాజెక్టు ఎవరి కోసం చేపట్టనున్నారు అనేది మౌలికమైన ప్రశ్నగా ముందుకు వచ్చింది. హైవేల తరహాలో నీటిపారుదల ప్రాజెక్టును సెల్ఫ్ ఫైనాన్స్ ఆధారంగా ఎలా నిర్మించగలరని సిపిఎం ప్రశ్నిస్తున్నది. ప్రాజెక్టును బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టి నీటిని కార్పొరేటీకరణ చేయటానికే ఈ ప్రాజెక్టు ఉద్దేశించినట్లు కనిపిస్తోంది. నీటిని అమ్ముకొని ప్రాజెక్టు నిర్మాణ ఖర్చుతో సహా ఆయా కంపెనీలు లాభాలు పిండుకొనే అవకాశం ఉంది. రైతులు, మంచినీరు వాడుకునే సామాన్య ప్రజలపై నీటి ఛార్జీల భారం పడుతుంది.

ఇది గేమ్ ఛేంజర్ అని అనటంలోనే ప్రకృతి వనరుగా ఉన్న నీటిని ప్రైవేటుపరం చేయటమనే అర్థం ఇమిడి ఉందని స్పష్టం అవుతోంది. రాష్ట్రంలో ప్రాజెక్టులన్నీ పూర్తయితే వాటిని లింకు చేసుకోవటం చాలా సులభమైన పని. రాష్ట్రానికి, ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేని బనకచర్ల ప్రాజెక్టును పక్కన పెట్టి వెనుకబడిన ప్రాంతాల ప్రాజెక్టులకు తక్షణ ప్రాధాన్యతనిచ్చి, నిధులు కేటాయించి పూర్తి చేయాలి' అని సిపిఎం ఆ ప్రకటనలో డిమాండ్ చేసింది. నదుల అనుసంధానం పేరుతో నీటిని ప్రైవేటీకరించి, ప్రజలపై భారాలు మోపొద్దని కోరింది.



నల్లబర్లీ పొగాకు కొనుగోలు ప్రారంభిస్తున్న మార్క్‌ఫెడ్ మేనేజర్

మార్క్‌ఫెడ్ ద్వారా 'నల్లబర్లీ' కొనుగోలు

బాపట్లలో నాలుగు కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి - పర్చూరు (బాపట్ల)

మార్క్‌ఫెడ్ ద్వారా నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయనున్నట్లు మార్కెఫెడ్ బాపట్ల జిల్లా మేనేజర్ కరుణశ్రీ తెలిపారు. పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కరుణశ్రీ మాట్లాడుతూ.. జిల్లాలోని పర్చూరు, ఇంకొల్లు, మార్టూరు, నంది పాడులో పొగాకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తొలిరోజు నాలుగు కేంద్రాల నుంచి 6.40 కింట్వాలు కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఒక క్వింటాకు రూ.12,000 చొప్పున ధర నిర్ణయించినట్లు తెలిపారు. రైతులు పండించిన మొత్తం పంటను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎ గ్రేడ్ పొగాకుకు ఎంత ధర ఇస్తారనే విషయంపై త్వరలో మార్గదర్శకాల జిఒ విడుదల చేస్తామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా గ్రామాలు, ప్రాంతాల వారీగా పొగాకును కొనుగోలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు షేక్ షంసుద్దీన్, రంగయ్య చౌదరి, కారుమంచి కృష్ణ, పొగాకు రైతులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి నలుగురు మృతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి ,జమ్మలమడుగు రూరల్

ఈతకు వెళ్లి కడపలో ఇద్దరు, తిరుపతిలో ఇద్దరు మరణించారు. పోలీసులు, మృతుల బంధువుల కథనం మేరకు.. శ్రీకాళహస్తి పట్టణం ముత్తరాశి పాలెం గ్రామానికి చెందిన లక్ష్మి తన కూతురు బిడ్డ అయిన నందినిని తీసుకుని కలవకూరు చెక్‌డ్యామ్ వద్దకు ఆటోలు బయలుదేరారు. అయితే ఆ సమయంలో చుట్టు పక్కల చిన్నారులు కూడా మారం చేయడంతో వారిని తీసుకువెళ్లారు. చెక్‌డ్యామ్‌లో నందిని(7), లిఖిత్ (14)లు ఇసుకలో కూరుకుపోయారు. బయటకు రాలేక ఊపిరాడక మరణించారు. లిఖిత్‌ది శ్రీకాళహస్తి పట్టణం సాలిపేటకు చెందిన వాసిగా పోలీసులు గుర్తించారు.

కడప జిల్లా జమ్మలమడుగులో ఉన్న తన చెల్లెలిని చూడటానికి హైదరాబాద్ నుంచి మనోహర్ కుటుంబం కడపకు వచ్చింది. గండికోటకు వెళ్లి తిరిగి వస్తుండగా ముద్దనూరు రోడ్డులోని పెన్నా నదిలో ఈత ఆడేందుకు తండ్రీ గంగుల మనోహర్ (40), కుమారుడు గంగుల జోయల్ (16) దిగారు. లోతు ఎక్కువగా ఉండడంతో వారిరువురూ నదిలో కొట్టుకుపోయారు. గజ ఈతగాళ్ల సహాయంతో జోయల్‌ను, మనోహర్‌ను ఒడ్డుకు చేర్చారు. అయితే అప్పటికే వారిద్దరూ మరణించారు.

ఇజ్రాయిల్ దారుణాలకు మరో 66మంది పాలస్తీనియన్లు బలి

ఆహార కేంద్రాలపై అమానుష దాడుల్లో 118కి పెరిగిన మృతులు

గాజా : ఇజ్రాయిల్ దురాగతాలకు అంతం లేకుండా పోతోంది. గాజాలో కొనసాగిస్తున్న దాడుల్లో శనివారం తెల్లవారు జామునుండి సాయంత్రానికి 66మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. దక్షిణ గాజాలోని రఫాకు సమీపంలో అల్ అఖావాలో ఆహార పంపిణీ కేంద్రం వద్ద తమ వంతు ఆహారం కోసం వేచి వున్న వారిపై జరిగిన కాల్పుల్లో ఎనిమిది మంది మరణించారు. దీంతో గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్ (జిహెచ్‌ఎఫ్) తన కార్యకలాపాలు మొదలుపెట్టినప్పటి నుండి ఆహారం కోసం వచ్చి మరణించిన వారి సంఖ్య 118కి పెరిగింది. గాజా నగరంలోని సాబ్రా ప్రాంతంలో ఇజ్రాయిల్ జరిపిన దాడిలో 15మంది మరణించగా, మరో 50మంది గాయపడ్డారని గాజా పౌరరక్షణ దళాలు తెలిపాయి. ఇప్పటివరకు ఇజ్రాయిల్ ఊచకోతకు బలైన వారి సంఖ్య 54,772కు చేరుకుంది. గాయపడిన వారి సంఖ్య 1,25,834కి చేరుకుందని గాజా ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. వీరు కాకుండా వేలాదిమంది ఇంకా శిధిలాల కింద చిక్కుకుపోయి లెక్కలకు అందకుండా వున్నారని పేర్కొంది. హమాస్ చెరలో వున్న థాయి జాతీయుడు నతాపాంగ్ పింటా మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఇజ్రాయిల్ ఆర్మీ ప్రకటించింది. ఇజ్రాయిల్ ఆర్మీ ముట్టడి చేసిన ప్రాంతంలో ప్రస్తుతం ఇజ్రాయిల్ బందీ మతన్ జంగాకర్ వున్నాడని హమాస్ ప్రతినిధి అబూ ఒబెదా హెచ్చరించారు. శుక్రవారం నాటి దాడిలో ఒకే కుటుంబానికిచెందిన 40మందికి పైగా మరణించారని హమాస్ తెలిపింది. ఈ దారుణమైన కిరాతకాలను తక్షణమే నిలిపేలా అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకోవాలని కోరింది.



ఇజ్రాయిల్ దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన కుటుంబ సభ్యుల వద్ద విచారంగా కూర్చున్న పాలస్తీనా వాసులు

ప్రజా రాజధానిగా అమరావతి

ఎంబివికె సదస్సులో వక్తలు



సదస్సులో మాట్లాడుతున్న సి రామచంద్రయ్య, చిత్రంలో బి గంగారావు, వడ్డే శోభనాద్రీశ్వరరావు, కె లక్ష్మణరావు, పి మధు, సిహెచ్ బాబురావు , కె పోలారి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతిని కార్పొరేట్ రాజధానిగా కాకుండా ప్రజా రాజధానిగా తీర్చి దిద్దాలని పలువురు వక్తలు సూచించారు. మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె) ఆధ్వర్యంలో 'అమరావతి రాజధాని-నిధులు- విధానాలు' అనే అంశంపై అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం బాధ్యులు గంగారావు అధ్యక్షతన శనివారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అమరావతిని పాలకులు కార్పొరేట్ రాజధానిగా మార్చే విధంగా విధాన పరమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని, అలా ముందుకెళితే అది ప్రజారాజధాని ఎలా అవుతుందని ప్రశ్నించారు. సెస్ మాజీ ప్రొఫెసరు సి రామచంద్రయ్య మాట్లాడుతూ.. బ్రిటీష్ హయాం నుంచి పెద్ద పెద్ద నగరాలన్నీ ఓడరేవుల ఆధారంగా నిర్మాణాలు జరిగాయని, స్వాతంత్ర్యానంతరం నిర్మితమైన నయారాయపూర్, భువనేశ్వర్, గాంధీనగర్, చండీగఢ్ వంటి రాజధానులు కూడా నేటికీ పెద్ద నగరాలుగా మారలేదన్నారు. రాష్ట్రంలో అనేక నగరాలు, పలు ఎయిర్‌పోర్టులు, నౌకాశ్రయాలు ఉన్నాయని, వీటిని అభివృద్ధి చేస్తే ఆర్థిక శక్తిగా ఎదుగుతామన్నారు. అమరావతి పేరుతో వేలాది ఎకరాల భూములు తీసుకుని ఆయా భూములను ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలకు కేటాయించడం సమంజసం కాదన్నారు. రాజధాని అమరావతి నిర్మాణం కోసం స్విస్ ఛాలెంజ్ విధాన ఒప్పందంలో విజయవాడ నుంచి స్విట్జర్లాండ్‌కు నేరుగా విమానయాన కనెక్టివిటీ అని అన్నట్లు అప్పట్లో చెప్పారని, స్విస్ ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో తాత్కాలికంగా ఇండిగో విమానాలను నాలుగు రోజులు ముచ్చటగా నడిపారని రామచంద్రయ్య పేర్కొన్నారు.

అమరావతిలో విమానాశ్రయం కోసమంటూ ఏకంగా 5 వేల ఎకరాలు భూమి కావాలని, అభివృద్ధి కోసం మరో 35 వేల ఎకరాల భూమి సేకరించాలని ప్రభుత్వం చూస్తోందన్నారు.

రైతు నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. మొదటి విడతలో తీసుకున్న భూములకు సంబంధించి రిటర్నబుల్ ప్లాట్లు నేటికీ ప్రభుత్వం అభివృద్ధి చేయలేదన్నారు. రైతుల ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మూడేళ్లలో ప్లాట్లను అభివృద్ధి చేయడంతోపాటు మౌలిక వసతులు కల్పిస్తామని హామీనిచ్చి, నేటికీ ఎందుకు ఆయా ప్లాట్లను అభివృద్ధి చేయలేదని ఆయన ప్రశ్నించారు. తొలివిడత తీసుకున్న భూములకు సంబంధించి రైతులకు న్యాయం చేయని ప్రభుత్వం ఇప్పుడు 40 వేల ఎకరాలు భూములు సేకరించాలని మిగతా 5లో

మరో ఐదుగురు మావోయిస్టుల మృతదేహాలు లభ్యం

బీజాపూర్ అటవీ ప్రాంతంలో స్వాధీనం

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఇంద్రావతి జాతీయ పార్క్ అటవీ ప్రాంతంలో శనివారం ఉదయం ఐదుగురు మావోయిస్టుల మృతదేహాలను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. వీరిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ బీజాపూర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన విషయం తెలిసిందే. ఇంద్రావతి జాతీయ పార్క్ ప్రాంతంలో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు ముఖ్య నేత భాస్కర్ కూడా చనిపోయారు. "మూడు రోజుల పాటు జరిగిన మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్‌లో ఇద్దరు సీనియర్ నేతలు... కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ అలియాస్ గౌతమ్, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు మైలారపు ఆదేలు అలియాస్ భాస్కర్... సహా మొత్తం ఏడుగురు చనిపోయారు" అని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సరిహద్దులో మావోయిస్టులకు పట్టున్న కీలక ప్రాంతాలలో భద్రతా దళాలు గురువారం నుంచి గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. శుక్రవారం సుధాకర్, శనివారం భాస్కర్ మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి, శనివారం జరిపిన గాలింపు చర్యలలో ఇద్దరు మహిళలు సహా ఐదుగురు మావోయిస్టుల మృతదేహాలు కూడా లభ్యమయ్యాయి. వారు ఎవరన్నది తెలియరాలేదు. వీరంతా మావోయిస్టు పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న సభ్యులేనని, వారిని గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని ఓ పోలీసు అధికారి తెలిపారు. ఘటనా స్థలం వద్ద రెండు ఎకె-47 తుపాకులు సహా ఆయుధాలు, పేలుడు పదార్థాలు లభ్యమయ్యాయని ఆయన చెప్పారు. ఆపరేషన్‌లో భాగంగా పాము కాటు, తేనెటీగల దాడి, డీహైడ్రేషన్ వంటి కారణాలతో కొందరు భద్రతా సిబ్బంది గాయపడ్డారని, వారి పరిస్థితి నిలకడగా ఉన్నదని వివరించారు. ఛత్తీస్‌గఢ్ పోలీసులు మావోయిస్టు నేతలను బీజాపూర్‌లో కస్టడీలోకి తీసుకొని ఒకరి తర్వాత ఒకరిని కాల్చి చంపారని పౌర హక్కుల కార్యకర్తలు, సంఘాలు ఆరోపిస్తున్నాయి.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-మార్కాపురం (ప్రకాశం జిల్లా)

మిర్చి పంటకు గిట్టుబాటు ధర లేక.. అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణ పరిధిలోని సుందరయ్య కాలనీలో శనివారం చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. తర్లుపాడు మండలం మీర్జపేటకు చెందిన కౌలు రైతు రాజారపు పెద్ద యల్లమందయ్య (56) గత 20 ఏళ్ల క్రితం మార్కాపురం వచ్చారు. ఆరు ఎకరాల పొలం కౌలుకు తీసుకొని ఏటా మిర్చి పంటను సాగు చేస్తున్నారు. ఎకరానికి సుమారు రూ. రెండు లక్షల పెట్టుబడి పెట్టారు. తెగుళ్ల కారణంగా అరకొరగా వచ్చిన దిగుబడిని గుంటూరులోని మిర్చి యార్డుకు తరలించారు. అక్కడ క్వింటా మిర్చి ధర రూ. పది వేలు మించలేదు. మిర్చి కోతకు కార్మికులకు క్వింటాకు రూ. ఆరు వేల ఖర్చు అయ్యింది. ఆదాయం రాకపోగా పెట్టుబడిలో లోటు కనిపించింది. ఏ బ్యాంకు అప్పు ఇవ్వకపోవడంతో ప్రయివేటు వ్యక్తుల వద్ద తీసుకున్న రుణం వడ్డీతో కలిపి రూ. 25లక్షల మేర తేలింది. అప్పులు తీర్చే అవకాశం లేకపోవడంతో మనస్తాపానికి గురై పొలం వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

నకిలీ ఐఆర్ఎస్ అధికారి అరెస్టు

ప్రజాశక్తి-నెల్లూరు

నకిలీ ఐఆర్ఎస్ అధికారిని నెల్లూరు పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను డిఎస్‌పి సింధుప్రియ మీడియాకు తెలిపారు. ఆమె తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం దొంగరంపూరు గ్రామానికి చెందిన రాంపూర్ రమేష్ ఈ నెల నాలుగన సంతపేటలోని తల్పగిరి రంగనాథస్వామిని దర్శించుకునేందుకు వచ్చారు. తాను ఐఆర్ఎస్ అధికారినని, రీజనల్ జాయింట్ కమిషనర్‌గా నగరానికి బదిలీపై వచ్చానని ఆలయ ఇఒ శ్రీనివాసులరెడ్డితో పరిచయం చేసుకున్నారు. అదే సమయంలో తాను ఆదాయపన్ను, భూ వివాదాలు పరిష్కారం చేస్తుంటానని నమ్మబలికించారు. అదే రోజు సాయంత్రం దేవస్థానం ఇఒకు ఫోన్ చేసి తనను నేరుగా వచ్చి కలవాలని రమేష్ చెప్పాడు. అతని మాటలు నమ్మశక్యంగా లేకపోవడంతో పోలీసులకు ఇఒ ఫిర్యాదు చేశారు. నకిలీ అధికారిని అదుపులోకి తీసుకోవడంతోపాటు ఓ వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కాకాణి కేసులో ముగ్గురికి బెయిల్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

మాజీమంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి కేసులో ముగ్గురికి బెయిల్ మంజూరైంది. పొదలకూరు అక్రమ మైనింగ్ కేసులో కాకాణి గోవర్ధన్‌రెడ్డితో పాటు పలువురు నెల్లూరు జైల్లో రిమాండ్‌లో ఉన్నారు. శనివారం రాష్ట్ర హైకోర్టు అరవింద్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మస్తాన్‌లకు బెయిల్ మంజూరైంది. కాకాణి గోవర్ధన్‌రెడ్డికి బెయిల్ నిరాకరించింది.

గుంటూరులో కన్నప్ప ప్రీ రిలీజ్ వేడుకలు

- బ్రాహ్మణ సంఘాల నిరసన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కన్నప్ప సినిమా ప్రీ రిలీజ్ వేడుకలను గుంటూరు శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శనివారం నిర్వహించారు. సీనియర్ నటులు మోహన్‌బాబు, హీరో మంచు విష్ణు, నటులు బ్రహ్మానందం, మాజీ ఎమ్మెల్యే తాడిశెట్టి వెంకట్రావు, ఆయన సోదరుడు తాడిశెట్టి మురళీ తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. సినిమాకు సంబంధించిన వివరాలను మోహన్‌బాబు, మంచు విష్ణు వివరించారు. సినిమాలో బ్రాహ్మణులను కించపరిచారని ఆరోపిస్తూ స్థానిక శంకర్ విలాస సెంటర్‌లో బ్రాహ్మణ చైతన్య వేదిక అధ్యక్షులు సిరివరపు శ్రీధర్, అర్చక సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంధ్యాల రామలింగశాస్త్రి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. బ్రాహ్మణ కులాన్ని అవహేళన చేస్తూ చిత్రంలో పలు దృశ్యాలు ఉన్నాయని వీటిపై సెన్సార్ బోర్డు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించిన పాత్రదారులపై ఇప్పటికే హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశామన్నారు.

మహిళల్ని అవమానిస్తే కాలగర్భంలో కలిసిపోవడమే

- మంత్రి నారా లోకేష్


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహిళల్ని అవమానించిన వారు కాలగర్భంలో కలిసిపోవడం ఖాయమని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అమరావతిపై విషం చిమ్మేందుకు మహిళా లోకాన్ని కించపరిచిన వైఎస్ జగన్ గ్యాంగ్‌ను ఎట్టి పరిస్థితుల్లో క్షమించబోమని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతి ముమ్మాటికీ దేవతల రాజధాని అని, భూములను త్యాగాలు చేసిన అమ్మల అమరావతి అని పేర్కొన్నారు. మహిళలను సాక్షి మీడియాలో ఇంత ఘోరంగా అవమానించవచ్చా? అని జగన్‌ను ప్రశ్నించారు. అమ్మల ఆత్మాభిమానం మీద, అమరావతి మీద విద్వేషంతో చేస్తున్న అసత్య ప్రచారం దిగజారుడుతనానికి పరాకాష్ట అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం కన్నుమూత

- నేడు అంత్యక్రియలు

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)



పల్లా సింహాచలం (ఫైల్)

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తండ్రి, మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం (93) అనారోగ్యంతో బాధపడుతూ విశాఖలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో శనివారం మృతిచెందారు. పలువురు మంత్రులు, ప్రముఖులు సీతంపేటలోగల రాజేంద్రనగర్‌లోని ఆయన స్వగృహానికి తరలివచ్చి నివాళు లర్పించారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమారుడు శ్రీనివాసరావు గాజువాక ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆదివారం అంత్యక్రియలు జరుగనున్నట్టు కుటుంబీకులు తెలిపారు. ఉదయం నుంచి కొత్త గాజువాకలోని ఎలిమెంటరీ స్కూల్ సమీపంలో ఉన్న పాత ఇంటి దగ్గర ప్రజల సందర్శనార్థం భౌతికకాయాన్ని ఉంచి, 11 గంటలకు అంతిమయాత్ర చేపట్టనున్నారు. తెలుగుదేశం పార్టీ తరపున 1994లో విశాఖ - 2 ఎమ్మెల్యేగా గెలుపొందారు. వుడా డైరెక్టర్‌గా, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులుగా పనిచేశారు.

సిఎం చంద్రబాబు సహా పలువురు ప్రముఖులు సంతాపం

పల్లా సింహాచలం మృతి పట్ల సిఎం చంద్రబాబు సంతాపం ప్రకటించారు. సింహాచలం కుమారుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు ఫోన్ చేసి పరామర్శించారు. కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పల్లా సింహాచలం భౌతిక కాయం వద్ద రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, వాసంశెట్టి సుభాష్ సహా పలువురు ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, పలు పార్టీల నాయకులు నివాళులర్పించారు.

శాతవాహన కళాశాల కూల్చివేతపై నిరసన

- ఆందోళనకారులు, పోలీసులకు మధ్య తోపులాట
- కళాశాలలోకి వెళ్లేందుకు యత్నం- అడ్డుకున్న పోలీసులు
- సమగ్ర విచారణ జరపాలి : బాబూరావు



కళాశాల గేటు ఎక్కి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న ఆందోళనకారులు

ప్రజాశక్తి - విజయవాడ :

విజయవాడ శాతవాహన కళాశాల భవనాలను కూల్చివేసి, ఆ స్థలాన్ని కబ్జాకోరులు ఆక్రమించడాన్ని నిరసిస్తూ శనివారం సిపిఎం తలపెట్టిన ధర్నా కార్యక్రమం పోలీసుల అత్యుత్సాహంతో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఆ కళాశాలను ప్రభుత్వమే స్వాధీనం చేసుకొని నిర్వహించాలని ఆందోళనకారులు డిమాండ్ చేయగా, పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో సిపిఎం నాయకులు, కార్యకర్తలు, కళాశాల పూర్వ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు... పోలీసులకు మధ్య తీవ్రస్థాయిలో తోపులాటలు, పెనుగులాటలు జరిగాయి. ఎండను సైతం లెక్క చేయకుండా ప్రశాంతంగా నిరసన తెలిపిన అనంతరం...కళాశాల శిధిలాలను పరిశీలించడానికి నలుగురిని లోపలికి అనుమతించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ తదితరులు గవర్నర్‌పేట సిఐ అడపా నాగమురళీని కోరారు. అందుకు సిఐ అంగీకరించలేదు. ఈ క్రమంలో ఆందోళనకారులకు, పోలీసులకు మధ్య వాదోపవాదాలు, తోపులాటలు చోటుచేసుకున్నాయి. ఒకరిద్దరు ఆందోళనకారులు కళాశాల గోడదూకి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. 'ఈ భూమి మాది' అని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చింపివేసి ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. శాతవాహన కళాశాలను ప్రభుత్వమే నిర్వహించాలని, కబ్జాకోరుల నుంచి కళాశాల భూమిని కాపాడాలని, కబ్జాకారులకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు డౌన్‌డౌన్ అంటూ ఆందోళనకారులు చేసిన నినాదాలు హోరెత్తాయి. మహిళలు, విద్యార్థులు, యువత పెద్దఎత్తున ఈ ధర్నాలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ... ఎంతో ఘన చరిత్ర కలిగిన విజయవాడ శాతవాహన కళాశాలను కొందరు కోర్టు తీర్పుల పేరుతో అడ్డగోలుగా కబ్జా చేస్తుంటే ప్రభుత్వం కళ్లు మూసుకుని కూర్చుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెద్దలు, ప్రజాప్రతినిధుల అండతోనే కబ్జాకారులు రాత్రికి రాత్రే రెచ్చిపోయారన్నారు. విజయవాడ నగర చరిత్రలో ఇలాంటి ఘటన ఎన్నడూ చూడలేదన్నారు. బుల్డోజర్ సంస్కృతి పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం కూల్చివేసిన శిథిలాలను చూడటానికి కూడా పోలీసులు అనుమతించకపోవడం చూస్తే... ప్రభుత్వం ఎవరికి అండగా ఉందో అర్థమవుతోందన్నారు. ఇది అర్బన్ సీలింగ్ భూమి అని, కళాశాల యజమానులకు సంబంధం లేదని అన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి, కబ్జాకోరుల నుంచి కళాశాల భూమిని రక్షించాలని డిమాండ్ చేశారు. శాతవాహన కళాశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ప్రభుత్వమే నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.శ్రీదేవి, పశ్చిమ, సెంట్రల్, తూర్పు సిటీ కమిటీ కార్యదర్శులు బోయి సత్యబాబు, భూపతి రమణారావు, పి.కృష్ణ దితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి : సిపిఐ రామకృష్ణ

రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా విజయవాడ శాతవాహన కళాశాలను కూల్చివేసిన ఘటనపై విచారణ చేసి, కబ్జా కోరులపై తగిన చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆక్రమణలకు, కబ్జాలకు గురౌతున్న ప్రభుత్వ విద్యాలయాలను కాపాడాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గోదావరి - బనకచర్ల ఎవరి కోసం ?

- కాంట్రాక్టర్ల కోసమా? అభివృద్ధి కోసమా?
- రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు... అభివృద్ధి కోసమా? కాంట్రాక్టర్ల కమీషన్ల కోసమా? అని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. శనివారం కర్నూలు కార్మిక కర్షక భవన్‌లో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ... రూ.81 వేల కోట్లతో గోదావరి - బనకచర్ల ప్రాజెక్టు నిర్మించడం ద్వారా మూడు లక్షల ఎకరాలకు కొత్తగా ఆయకట్టుకు నీరు అందిస్తామని, మరో 20 లక్షల ఎకరాలకు ఆయకట్టు స్థిరీకరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెబుతున్నారన్నారు. కర్నూలు జిల్లాలో 2018లో చంద్రబాబు శంకుస్థాపన చేసిన వేదవతి రిజర్వాయర్ నిర్మాణానికి రూ.రెండువేల కోట్లు ఖర్చు చేస్తే 80 వేల ఎకరాలకు నీరు అందించే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులకు రూ.13,844 కోట్లు ఖర్చు చేస్తే 13.80 లక్షల ఎకరాలకు సాగునీరు, 50 లక్షల మందికి పైగా తాగునీరు అందించే అవకాశం ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయకుండా, వాటి నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించకుండా రూ.81 వేల కోట్లతో నిర్మించే గోదావరి - బనకచర్ల ప్రాజెక్టు ఎవరి కోసం నిర్మిస్తున్నారనే సందేహాలు తలెత్తుతున్నాయన్నారు. ఆ సందేహాలను నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. అసలే అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా ఉన్న మన రాష్ట్ర ఆర్థిక పరిస్థితులలో రూ.81వేల కోట్లు ఖర్చుపెట్టి నిర్మించ తలపెట్టిన గోదావరి - బనకచర్ల ప్రాజెక్టు వెనకబడ్డ ప్రాంతాల అభివృద్ధి కోసమా లేక కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసమా అనేది స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. నిజంగా కరువు ప్రాంతాల అభివృద్ధి పట్ల, వెనకబడ్డ ప్రాంతాల్లో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పట్ల ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా మధ్యలో నిలిపివేసిన ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని కోరారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తక్షణం వెనుకబడ్డ ప్రాంతాల ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు కేటాయించి పూర్తి చేయాలని కోరారు. రూ.550 కోట్లతో పొగాకు, కోకో, మామిడి రైతులను ఏ రకంగా ఆదుకుంటారని ప్రశ్నించారు. రామకృష్ణ మాట్లాడుతూ... జిపిఎఫ్, విఎస్‌టి, అలయెన్స్ కంపెనీలు సిరి పొగాకు వేయమని చెప్పి ఇప్పుడు కొనడం లేదని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వమే పొగాకు కొనాలని కోరారు. సోలార్ పరిశ్రమల కోసం తీసుకున్న భూములకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కార్మిక వర్గానికి వ్యతిరేకంగా ప్రభుత్వ పాలన

- సిఐటియు ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి - నెల్లూరు

కార్మిక వర్గానికి వ్యతిరేకంగా రాష్ట్రంలో పాలన సాగుతోందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. శనివారం నెల్లూరులోని సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆశ బారెడు... ఆచరణ మూరెడు అన్న చందంగా రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వ పాలన ఉందన్నారు. కృష్ణపట్నం, విశాఖ ఉక్కు కర్మాగారాల్లో కార్మికులను తొలగించడం తప్ప రాష్ట్రంలో భారీ పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించిన దాఖలాలు ఏమీ లేవన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదాని, అంబాని వంటి కార్పొరేటర్లకు అండగా నిలుస్తూ కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో కార్మిక కుటుంబాలు ఏ విధంగా జీవనం సాగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జూలై తొమ్మిదిన నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ముందుగా జిల్లాలోని ముస్లిం సోదరులకు సిఐటియు రాష్ట్ర కమిటీ తరపున బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మహిళలపై దాడులు జరుగుతున్నాయని, పని ప్రదేశాల్లో వారికి రక్షణ లేదన్నారు. మహిళలతో రాత్రి సమయాల్లో పనిచేయించరాదని, ప్రభుత్వ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయని తెలిపారు.

అనుచిత వ్యాఖ్యలపై ఆగ్రహం

- సాక్షి ఛానెల్, వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టుపై పోలీసులకు రాజధాని మహిళల ఫిర్యాదు

ప్రజాశక్తి - యంత్రాంగం

సాక్షి ఛానెల్ నిర్వహించే లైవ్ విత్ కెఎస్ఆర్ కార్యక్రమంలో రాష్ట్ర రాజధాని అమరావతిపైన, రాజధాని నిర్మాణం కోసం భూములిచ్చిన మహిళలపై జర్నలిస్టు వివిఆర్ కృష్ణంరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. ఆ వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ రాజధాని మహిళలు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టు కృష్ణంరాజుపైన, కార్యక్రమాన్ని నిర్వహించిన కొమ్మినేని శ్రీనివాసరావుపైన, సాక్షి యాజమాన్యంపైనా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. గురువారం జరిగిన లైవ్‌షోలో పాల్గొన్న కృష్ణంరాజు అమరావతిని వేశ్యల రాజధానిగా, ఎయిడ్స్ రోగుల కేంద్రంగా అభివర్ణించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమరావతిని 'దేవతల రాజధాని'గా అభివర్ణిస్తూ చేసిన ప్రకటనను ప్రస్తావిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. కృష్ణంరాజు చేసిన ఈ వ్యాఖ్యలపై సోషల్‌మీడియాలో తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో శనివారం వివిధ గ్రామాల నుంచి తుళ్లూరుకు చేరుకున్న రైతులు, మహిళలు పోలీస్ స్టేషన్ ర్యాలీ నిర్వహించారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీనిపై మీడియాతో మాట్లాడిన తుళ్లూరు సిఐ కె. శ్రీనివాసరావు కేసు నమోదు అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. . గుంటూరు అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో కూడా ఈమేరకు టిడిపి నాయకులు ఫిర్యాదు చేశారు.

డిజిపికి డిప్యూటీ స్పీకర్ లేఖ

రాజధాని అమరావతి మహిళలను అవమానించి, పరువు నష్టం కలిగేలా ద్వేషపూరిత వాఖ్యలు చేసిన జర్నలిస్ట్ కృష్ణంరాజు, సాక్షి ఛానెల్ యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని డిజిపికి డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు శనివారం లేఖ రాశారు. అమరావతిని వేశ్యల రాజధానిగా అభివర్ణిస్తూ దిగ్భ్రాంతికరమైన వ్యాఖ్యలు చేశారని లేఖలో ప్రస్తావించారు. కృష్ణంరాజు ఆ వ్యాఖ్యలు చేసిన సమయంలో యాంకర్‌గా ఉన్న కొమ్మినేని శ్రీనివాసరావు వాటిని అడ్డుకునే ప్రయత్నం చేయలేదని, సాక్షి యాజమాన్యం కూడా ఆ వ్యాఖ్యలను ప్రసారం కాకుండా అడ్డుకోలేదని పేర్కొన్నారు. వీరందరి పైనా కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా, రాజధానిని, మహిళలను అవమానించే చర్యలకు దిగితే సహించేది లేదన్న సందేశాన్ని పంపాలని ఆయన కోరారు.



తుళ్లూరు లైబ్రరీ సెంటర్‌లో మానవహారంతో నిరసన తెలుపుతున్న ప్రజలు

మహిళలను కించపరిచే వ్యాఖ్యలు తగవు : సిపిఎం

రాష్ట్ర రాజధాని అమరావతిని, మహిళలను కించపరిచే పరుస్తూ కృష్ణంరాజ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై. నేతాజి ఒక ప్రకటనలో తెలిపారు. చరిత్రలో అమరావతికి ప్రత్యేకమైన గుర్తింపు ఉందని, బౌద్ధ క్షేత్రంగా, ఒకప్పటి రాజ్య రాజధానిగాను అమరావతి ఉందన్నారు.

ఆ కారణంగానే ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాజధాని పేరును అమరావతిగా నిర్ణయించడాన్ని రాష్ట్రంలోనూ దేశంలోనూ అనేకమంది హర్షించారని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాజధాని తరలింపు నిర్ణయం చేసినప్పుడు దానికి వ్యతిరేకంగా అమరావతి ఏకైక రాజధానిగా ఉండాలని కోరుతూ జరిగిన ఉద్యమంలో మహిళలు ప్రధానమైన భూమిక పోషించారన్నారు. ఇలాంటి నేపథ్యంలో ఒ టీవీ చర్చలో అమరావతిని వేశ్యల రాజధానిగా పేర్కొంటూ కృష్ణంరాజు అనుచిత వ్యాఖ్యలు చేయటం సరికాదన్నారు. ఇది రాజధాని ప్రాంత ప్రజలను, మహిళలనే కాక మొత్తం రాష్ట్ర ప్రజలను కూడా అవమానించటమేనని అన్నారు. ఈ వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

సుమోటోగా కేసు : ఐద్వా డిమాండ్

మహిళలను అవమాన పరుస్తూ మాట్లాడిన వారిపై పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసి విచారించాలని ఐద్వా రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బి. ప్రభావతి, డి.రమాదేవి విడుదల చేసిన ప్రకటనలో రాజధాని అమరావతిని వేశ్యల రాజధానిగా కించపర్చడాన్ని, హేళన చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. రాజధాని అమరావతిని వేశ్యల రాజధానిగా, ఎయిడ్స్ రోగుల కేంద్రంగా మాట్లాడటం మహిళలను అవమానపర్చడం కాదా? అని వారు ప్రశ్నించారు. రాష్ట్రాన్ని విడగొట్టి రాజధాని నిర్మించకుండా కేంద్రం, మూడు రాజధానుల పేరుతో జగన్ ప్రభుత్వం మహిళలను రోడ్డెక్కించి వీధుల పాలు చేశారని విమర్శించారు. భూములిచ్చిన రైతులు తీవ్ర బాధలు పడ్డారని పేర్కొన్నారు. రాజధాని నిర్మాణం కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలను వేశ్యలని, ఎయిడ్స్ రోగులంటూ మాట్లాడటం జర్నలిస్టు వృత్తికే కళంకమని తెలిపారు. వారు తక్షణం రాష్ట్ర ప్రజలకు, మహిళలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రజారోగ్య వ్యవస్థను గాడిలో పెట్టాం

- కరోనాపై ఆందోళన వద్దు
- మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ప్రజారోగ్య వ్యవస్థను గాడిలో పెట్టామని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ నిర్వాకాలతో ప్రజారోగ్య రంగంలో నెలకొన్న ప్రతికూల పరిస్థితుల్ని అధిగమిస్తూ కూటమి ప్రభుత్వం మార్పు తేగలిగిందన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ కింద 30కు పైగా పథకాలను అమలు చేసిన తీరు, సాధించిన ఫలితాల్ని గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి 2024-25లో రూ.100 కోట్లను ప్రోత్సాహక బహుమతిగా విడుదల చేసిందని తెలిపారు. సిబ్బంది హాజరు మెరుగవడంతో ఓపి సేవలు 8 శాతం మేరకు, ఐపి సేవలు 17.61 శాతం మేరకు పెరిగాయని చెప్పారు. ప్రభుత్వ వైద్యులు, ఇతర సిబ్బంది కొరతను తగ్గించేందుకు 8,619 నియామకాలను పూర్తి చేశామన్నారు. రాష్ట్రంలో కరోనా కేసులు 72 యాక్టివ్‌గా ఉన్నాయని, అయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి తెలిపారు.

పిపిపి విధానం ప్రజలకే లాభం : ఎమ్‌టి కృష్ణబాబు

వైద్య కళాశాలలను పబ్లిక్, ప్రైవేట్, భాగస్వామ్యం (పిపిపి) విధానంలో నిర్వహించడం వల్ల ప్రజలకే లాభమని వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పిపిపి విధానంలో చేపట్టబోయే వైద్య కళాశాలల్లో 50 శాతం కన్వీనర్ కోటా, 35 శాతం (సెల్ఫ్ ఫైనాన్స్‌డ్) బి కేటగిరి, 15 శాతం ఎన్ఆర్ఐ కోటా ఉంటుందని తెలిపారు. పిపిపి విధానం వల్ల పేద విద్యార్థులకు నష్టం ఉంటుంది కదా? అని విలేకరులు అడగ్గా.. ఇది ప్రభుత్వ విధానమని సమాధానం చెప్పారు. ఒక వైద్య కళాశాల ఏర్పాటు చేసేందుకు రూ.600 కోట్లు ఖర్చవుతుందని, నిర్వహణ ఖర్చు రూ.150 కోట్లు అవుతుందని వివరించారు. అసలు పిపిపి విధానంలో కళాశాలలు రాకపోతే 50 శాతం సీట్లు కూడా రావని చెప్పారు. ఈ సమావేశంలో వైద్యారోగ్యశాఖ కమిషనర్

దళిత, మైనారిటీ యువకులపై దాడిని సమర్థించడం అన్యాయం

- వామపక్ష పార్టీల ఖండన

ప్రజాశక్తి బ్యూరో- అమరావతి

గుంటూరు జిల్లా తెనాలిలో దళిత, మైనారిటీకి చెందిన ముగ్గురు యువకులను పోలీసులు నడిరోడ్డుపై దుర్మార్గంగా కొట్టడమే కాకుండా ఈ ఘటనను పోలీసు ఉన్నతాధికారులు, మంత్రులు బహిరంగంగా, నిస్సిగ్గుగా సమర్థించుకోవడాన్ని వామపక్ష పార్టీలు ఖండించాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనపై విచారణ జరిపించి దోషులపై చర్యలు తీసుకోవాలని వామపక్ష పార్టీల నేతలు శనివారం సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో డిమాండ్ చేశాయి. 'ఎవరైనా నేరం చేస్తే కోర్టుకు అప్పగించాలి, శిక్ష విధించాలి, అందుకు ఒక ప్రోసీజర్ కోడ్ ఉంది. కానీ బహిరంగంగా నడిరోడ్డుపై ఇద్దరు దళిత యువకులను, ఒక మైనారిటీ యువకుడిని పోలీసులు దారుణంగా కొట్టడం దుర్మార్గం. బాధితుల బంధువులు ఫిర్యాదు ఇవ్వడానికి కూడా భయపడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు టిడిపి వాటిని ఖండించింది. అదే టిడిపి ఇప్పుడు వాటిని బలపర్చడం అన్యాయం. ఇది ఆ పార్టీ ద్వంద్వ వైఖరిని వెల్లడిస్తోంది. పౌర సమాజమంతా ఈ దారుణాన్ని ఖండిస్తుండగా, పోలీసులపై చర్య తీసుకోవాల్సింది పోయి రాష్ట్ర హోంమంత్రి పోలీసుల చర్యను సమర్థిస్తూ మాట్లాడటం గర్హనీయం. అధికార పార్టీ నాయకులు కొంతమంది బహిరంగంగా, సోషల్ మీడియా ద్వారా ఘటనను సమర్థిస్తూ వాఖ్యలు చేయడం అమానుషం. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఈ ఘటనకు కారకులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలి' అని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, పి ప్రసాద్ (సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ), జాస్తి కిషోర్‌బాబు (సిపిఐ-ఎంఎల్), కాటం నాగభూషణం (యంసిపిఐ-యు), బి బంగార్రావు (సిపిఐ(యంఎల్) లిబరేషన్), బిఎస్ అమర్‌నాథ్ (యస్‌యుసిఐ-సి), పివి సుందరరామరాజు (ఫార్వర్డ్‌బ్లాక్), జానకి రాములు (రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ) ఈ ప్రకటన చేశారు.

రేపు డిఇఒ కార్యాలయాల ముట్టడి

- ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్‌జిటి)కు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపట్టాలని, సాంకేతిక తప్పిదాల వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి (డిఇఒ) కార్యాలయాల ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆయా సంఘాల నాయకులు ఎన్ వెంకటేశ్వర్లు (యుటిఎఫ్), ఎల్ సాయి శ్రీనివాస్ (ఎస్‌టియు), సిహెచ్ మంజుల (ఎపిటిఎఫ్-257), ఎస్ చిరంజీవి (ఎపిటిఎఫ్-1938), ఎం కృష్ణయ్య (పిఆర్‌టియు), ఎస్ బాలాజీ (ఎపియుఎస్), వి శ్రీనివాసరావు (ఎపిహెచ్‌ఎంఎ), కె ప్రకాష్‌రావు (ఆప్టా), వై అశోక్‌కుమార్ రెడ్డి (వైఎస్ఆర్‌టిఎ) ఐక్యవేదిక తరపున శనివారం ఉమ్మడిగా ప్రకటన విడుదల చేశారు. ఎస్‌జిటిలకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపడతామని మే 19, 20 తేదీల్లో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ సమక్షంలో జరిగిన చర్చలు సందర్భంగా అంగీకరించారని తెలిపారు. కానీ వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవాలని శుక్రవారం రాత్రి ఎనేబుల్ చేసి ఇచ్చిన హామీని ఉల్లఘించారని పేర్కొన్నారు. అదే విధంగా ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లకు ఇప్పటి వరకు జరిగిన బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియలో అనేక సాంకేతికపరమైన సమస్యలు తలెత్తడం వల్ల చాలా మంది నష్టపోయారని, వీరికి న్యాయం చేయాలన్నారు. క్లస్టర్ లెవెల్ అకడమిక్ టీచర్ ఖాళీలతో కలిపి ముందుగా ఇచ్చిన ఆప్షన్ల మేరకు బదిలీ ఉత్తర్వులు విడుదల చేయాలని కోరారు. రిక్వెస్ట్ బదిలీల ఆప్షన్ చూపించాలన్నారు. తుది సీనియార్టీ జాబితాలు విడుదల చేయకుండా, గ్రీవెన్స్ పరిష్కారం కాకుండానే ఆప్షన్లు పెట్టుకోవాలని ఒత్తిడి చేయడంతో నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఎంపిక చేసుకున్న ఖాళీలను కేటాయించకుండా ఉద్యోగోన్నతుల్లో చూపడం వల్ల సీనియర్లు నష్టపోతున్నారని తెలిపారు. సీనియర్ ఉపాధ్యాయులు ముందుగా బదిలీ కోసం ఎంపిక చేసుకున్నా.. జూనియర్లకు కేటాయిస్తున్నారని వివరించారు. ఈ సమస్యలపై ఈ నెల 8న డిఇఒ కార్యాలయాల ముట్టడికి పిలుపునిచ్చామని వెల్లడించారు.

గిరిజన యూనివర్సిటీని బలోపేతం చేయండి

రాష్ట్రపతికి అజశర్మ లేఖ


ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

రాష్ట్రంలోని కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయాన్ని బలోపేతం చేయాలని కోరుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ అజశర్మ శనివారం ఓ లేఖ రాశారు. విశాఖలో త్వరలో జరుగనున్న కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయ స్నాతకోత్సవానికి రాష్ట్రపతి విచ్చేస్తున్న నేపథ్యంలో అజశర్మ పలు విషయాలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఆ వివరాలను ఆయన మీడియాకు వివరించారు. ఎపి రాష్ట్ర పునర్విభజన చట్టం - 2014 ప్రకారం గిరిజన విశ్వవిద్యాలయం గొప్ప అంచనాలతో స్థాపించబడినప్పటికీ దాని అభివృద్ధి అసంపూర్ణంగా ఉందని పేర్కొన్నారు. శాశ్వత క్యాంపస్ నిర్మాణం ఇంకా పెండింగ్‌లోనే ఉందని, ఇప్పటికి పదేళ్లకుపైగా గడిచినప్పటికీ ప్రాథమిక దశలోనే ఉందని చెబుతూ అందుకు సంబంధించిన రెండు తాజా ఛాయాచిత్రాలను రాష్ట్రపతికి పంపించిన లేఖతో జత చేశానని చెప్పారు. గిరిజన విశ్వవిద్యాలయం ప్రస్తుతం పరిమిత మౌలిక సదుపాయాలతో పనిచేస్తోందన్నారు. బోధన, బోధనేతర సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, ఇది విద్య నాణ్యత, విద్యార్థుల సేవలను ప్రభావితం చేస్తోందని తెలిపారు. దాదాపు 180 మంది విద్యార్థులు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి చదువుతున్నారని, వారిలో దాదాపు సగం మంది బాలికలు ఉన్నారని, వారు వసతి సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వారికి నేటికీ హాస్టల్ సౌకర్యం లేదన్నారు. కనీసం 50 శాతం సీట్లు గిరిజన విద్యార్థులకు కేటాయించబడేలా నియమాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. వర్సిటీ శాశ్వత క్యాంపస్ నిర్మాణం వేగవంతం అయ్యేలా, పెండింగ్‌లో ఉన్న అన్ని సివిల్ పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అవసరమైన అన్ని పోస్టులను భర్తీ చేయాలన్నారు. హాస్టళ్లు, లైబ్రరీలు, ప్రయోగశాలలు, డిజిటల్ వనరులు సహా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని లేఖలో పేర్కొన్నట్లు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌ను ఐక్య పోరాటాలతో కాపాడుకుంటాం

- ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ఐక్య పోరాటాలతో కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి ఆదినారాయణ, కెఎస్ఎన్ రావు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1577వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఎఐటియుసి నాయకులు, స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ అన్ని విధాలుగా స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును ఖండించారు. లక్షల కోట్ల రూపాయలు విలువ చేసే భూములను కారుచౌకగా ప్రయివేటుపరం చేయడానికి కుట్రలు సాగుతున్నాయన్నారు. లాభాలు వచ్చేందుకు అవకాశమున్న తరుణంలోనూ ప్లాంట్‌లోని ఒక్కో విభాగాన్నీ నిర్వీర్యపరుస్తూ, కార్మికులను తొలగించేస్తూ నష్టాలవైపు నెడుతున్నారని విమర్శించారు. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సుదీర్ఘ కాలంగా కార్మికులు పోరాడుతున్నా ప్రభుత్వానికి పట్టడంలేదన్నారు. ఇప్పటికైనా కేంద్రం తీరును మార్చుకుని సొంత గనులు కేటాయించి, పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని కోరారు.

విచారణ తర్వాతే పార్టీలో చేరికలు

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇతర పార్టీల నాయకులను టిడిపిలోకి చేర్చుకునే ముందు తప్పనిసరిగా వారి గురించి కేంద్ర కార్యాలయానికి తెలియజేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీలో చేరే వారి గురించి పూర్తిగా కేంద్ర కార్యాలయం విచారణ చేసిన తర్వాత పార్టీ అనుమతితో చేర్చుకుంటామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని పార్టీలో వివిధ హోదాల్లో ఉన్న నాయకులందరూ గమనించాలన్నారు.

7 రోజుల్లో కోటి మందికి పైగా రేషన్ పంపిణీ

- మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రజా పంపిణీ చరిత్రలో 7 రోజుల్లో కోటి మందికి పైగా రేషన్ కార్డుదారులకు సరుకులు పంపిణీ చేయడం గర్వంగా ఉందని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం ఈ నెల ఒకటిన 29,796 చౌక ధరల దుకాణాల ద్వారా ఏడు రోజుల వ్యవధిలో 1,05,27,767 మంది కార్డుదారులకు రేషన్ సరుకులు అందజేశామన్నారు. 98,77,670 మంది కార్డుదారులకు పంచదార పంపిణీ చేశామని తెలిపారు. 65 ఏళ్లకు పైబడిన వృద్ధులు, వికలాంగుల కోసం ప్రత్యేకంగా ఇంటి వద్దకే సరుకులు అందించే సేవలను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఇప్పటి వరకు 11,05,439 మందికి పంపిణీ చేసినట్లు వెల్లడించారు.

టిడిపికి ‘సుగవాసి’ రాజీనామా

ప్రజాశక్తి-రాయచోటి: తెలుగుదేశం పార్టీకి అన్నమయ్య జిల్లా రాజంపేట సీనియర్ నేత, మాజీ జడ్‌పి చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం రాజీనామా చేశారు. ఈ మేరకు పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకు తన రాజీనామా లేఖను శనివారం పంపారు. పార్టీలో చోటు చేసుకుంటున్న పరిణామాలతో మనస్థాపానికి గురై రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. 2024లో రాజంపేట నియోజకవర్గం నుంచి టిడిపి తరుపున పోటీ చేసి ఓడిపోయిన సంగతి తెలిసిందే. ఆ తరువాత జిల్లాల్లో మారుతున్న సమీకరణాల కారణంగా పార్టీ కార్యక్రమాలకు ఆయన దూరంగా ఉంటూ వచ్చారు. ప్రజలు, కార్యకర్తలు, సన్నిహితుల సూచనలు, మనోభావాలను, అభిప్రాయాలను గౌరవిస్తూ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

నేడు తెలంగాణ కేబినెట్ విస్తరణ

- వివేక్, కవ్వంపల్లి సత్యనారాయణ, వాకిటి శ్రీహరిలకు చోటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు రంగం సిద్ధమైంది. ఆదివారం ఉదయం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ కొత్త మంత్రుల చేత ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కేబినెట్‌లో కొత్తగా ముగ్గురికి అవకాశం కల్పించేందుకు కాంగ్రెస్ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. స్థానిక ఎన్నికల వేళ ఎలాంటి గొడవలకు తావు లేకుండా వ్యూహాత్మకంగా కొత్త వారికి అవకాశం ఇచ్చారు. బిసి, మాల,మాదిగ సామాజిక వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలకు ఈ విస్తరణలో చోటు కల్పించినట్లు తెలుస్తోంది. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి (మాల), మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ (మాదిగ), మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి (ముదిరాజ్)లు ఆదివారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఇద్దరికీ బెర్తు ఖాయమైనట్టు ప్రచారం జరిగినా ఈసారి అవకాశం లేనట్టేనని సమాచారం. కాగా, మంత్రివర్గ విస్తరణకు సంబంధించి శనివారం రాత్రి వరకు అధికారిక సమాచారం వెల్లడికాలేదు.

నేటి నుంచి చేప ప్రసాదం పంపిణీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో: ఆస్తమా బాధితులకు బత్తిన సోదరులు ఏటా ఉచితంగా సరఫరా చేసే చేప ప్రసాదం పంపిణీ ఆదివారం హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ప్రారంభంకానుంది. రెండు రోజుల పాటు జరిగే కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. మృగశిర కార్తె సందర్భంగా బత్తిన కుటుంబ సభ్యులు ఏటా చేప ప్రసాదం పంపిణీ చేస్తున్నారు. ఈ సారి పంపిణీ కార్యక్రమాన్ని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా పంపిణీ ప్రారంభించనున్నారు. ఈ చేప ప్రసాదం శనివారం రాత్రికే నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానానికి ఇతర రాష్ట్రాల నుంచి ప్రజలు చేరుకున్నారు. చేప ప్రసాదం కోసం వచ్చిన ప్రజల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఈ సారి 42 క్యూలైన్లను ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు.

ఉల్లాసభరితంగా సీ కయాకింగ్ పోటీలు

- సముద్ర అలలపై పోటీపడుతున్న క్రీడాకారులు
- మంగినపూడి బీచ్ వేదికగా మూడు రోజులుగా సాగుతున్న పోటీలు



పారారైడ్‌కు వెళ్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, పక్కన శాప్ చైర్మన్ రవినాయుడు, ఆర్‌టిసి చైర్మన్ కొనకళ్ల నారాయణరావు

ప్రజాశక్తి- కలెక్టరేట్ (కృష్ణా)

కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని మసులా బీచ్ ఫెస్ట్-2025లో భాగంగా 3వ జాతీయ స్థాయి సీ కాయాకింగ్ అండ్ స్టాండ్ అఫ్ ఫెడల్ ఛాంపియన్ షిప్ పోటీలు వీక్షించేందుకు మూడోరోజు శనివారంనాడు పర్యాటకులు భారీగా హాజయ్యారు. ఫెస్ట్‌లో నిర్వహిస్తున్న కెనాయింగ్ అండ్ కయాకింగ్ పోటీలు సముద్రపు అలల మధ్య ఎంతో ఉల్లాసభరితంగా జరుగుతున్నాయి. మొదటిసారి మచిలీపట్నం సముద్ర తీరంలో ఈ పోటీలు జరుగుతుండడంతో చూసేందుకు చిన్నారులు, పెద్దలు తరలి వచ్చారు. దీంతో బీచ్ సందడిగా మారింది.

కెనాయింగ్ అండ్ కయాకింగ్, కానోయీ స్లాలోమ్, కానో పోలో, డ్రాగన్ బోట్, సీ కాయాకింగ్ అండ్ స్టాండ్ అప్ పెడల్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఇండియాలో మూడోసారి, ఆంధ్రప్రదేశ్‌లో మొదటి సారి జాతీయ స్థాయిలో సీ కాయాకింగ్ అండ్ స్టాండ్ అఫ్ ఫెడల్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మిక్సీడ్, మాస్టర్స్ విభాగాల్లో 200, 500, 2000, 5000 మీటర్ల విభాగంలో పోటీలు జరిగాయి.

కెనాయింగ్ అండ్ కయాకింగ్ పై చిన్నారుల ఆసక్తి

కెనాయింగ్ అండ్ కయాకింగ్‌లో శిక్షణ పొందేందుకు చిన్నారులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. జలక్రీడ కావడంతో అలల మధ్య పడవ పోటీలను ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కెనాయింగ్ అండ్ కయాకింగ్ అత్యంత ఆదరణ పొందుతుంది. ప్రస్తుతం విశాఖపట్నంలో శిక్షణనిస్తున్నారు.

క్రీడాకారులకు మంత్రి అభినందనలు

రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్‌టిసి చైర్మన్ కొనకళ్ల నారాయణ, శాప్ చైర్మన్ రవి నాయుడు ఈ పోటీలను పర్యవేక్షించారు. అనంతరం వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకొని అభినందించారు.

ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు బాసట

- భారత అఖిలపక్ష బృందానికి అమెరికా హామీ

వాషింగ్టన్ : ఉగ్రవాదంపై భారత్ సాగించే పోరాటంలో అండగా వుంటామని అమెరికా హామీ ఇచ్చింది. ఈ మేరకు అమెరికాలో పర్యటించిన కాంగ్రెస్ ఎంపి శశి థరూర్ నేతృత్వంలోని అఖిల పక్ష బృందానికి అమెరికా డిప్యూటీ విదేశాంగ మంత్రి క్రిస్టొఫర్ లందావు హామీ ఇచ్చాయి. శుక్రవారం నాడు భారత ప్రతినిధి బృందం క్రిస్టొఫర్ లాందావుతో భేటీ అయింది. భారత పార్లమెంటరీ ప్రతినిధులతో అద్భుత సమావేశం జరిగిందని, ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు బాసటగా ఉంటామని మరోసారి ఉద్ఘాటిస్తున్నామని లందావు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఇరు దేశాల వ్యూహాత్మక సంబంధాలపై చర్చించినట్లు తెలిపారు. ఉగ్రవాదం ఏ రూపంలో వున్నా, ఎవరు పాల్పడినా వాటిని దృఢ చిత్తంతో ఎదుర్కొంటామని, ఆ దాడులను తిప్పికొడతామని అఖిల పక్షం స్పష్టం చేసింది. పరస్పర ప్రయోజనాలు కలిగిన రంగాల్లో సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్ళడం ద్వారా ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయాల్సిన ప్రాముఖ్యతను ఉభయ పక్షాలు నొక్కి చెప్పాయని అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి టామీ బ్రూస్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అమెరికా సెనెట్ విదేశాంగ సంబంధాల కమిటీలో సభ్యుడు, సెనెటర్ క్రిస్ వాన్ హోలెన్‌తో కూడా అఖిల పక్షం సమావేశమైంది. ఈ సందర్భంగా భారత్ ఆత్మరక్షణ హక్కును ఆయన సమర్థించారు. మరో సెనెటర్ కోరీబూకర్‌తో శశి థరూర్ ఫోన్‌లో మాట్లాడారు.

హిందూపురం సిఐపై చర్యలు

- డిజిపికి కెవిపిఎస్ లేఖ

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో: ప్రజా సమస్యలపై పనిచేస్తున్న సామాజిక కార్యకర్త ఎంవి రమణను దుర్భాషలాడిన హిందూపురం సిఐపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, అంద్ర మాల్యాద్రి డిజిపికి శనివారం లేఖ రాశారు. సత్యసాయి జిల్లాలో తమ సంఘం కార్యదర్శిగా పనిచేస్తున్న ఎంవి రమణ, అనేక ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్నారని తెలిపారు. ఆయన పోరాటం వల్ల గతేడాది మార్చిలో హిందూపురంలో గుడిసెలు వేసుకుని ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ ప్రజలు నివాసం ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం వాటిని తొలగించడంతో రమణ హైకోర్టును ఆశ్రయించారని పేర్కొన్నారు. బాధితులను విచారణ చేసి నాలుగు నెలలలోపు పట్టాలు అందించాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని వివరించారు. దీనిపై కొంతమంది రమణపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఈ అంశంపై హిందూపురం సిఐ రమణపై దురుసుగా ప్రవర్తించడమే కాకుండా అతనిపై అక్రమ కేసు నమోదు చేశారని వెల్లడించారు. రమణ స్టేషన్‌లోనే స్పృహ తప్పి పడిపోయినా ఆస్పత్రికి కూడా తరలించకుండా వ్యవహరించారని తెలిపారు. అతని వెంట వచ్చిన ప్రజలను కూడా భయభ్రాంతులకు గురిచేశారని పేర్కొన్నారు. ఇక్కడ సమస్యలుంటే టిడిపి వారు చుసుకుంటారని సిఐ అన్నారని పేర్కొన్నారు. ఈ అంశాన్ని పరిశీలించి హిందూపురం సిఐపై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, రమణపై అక్రమ కేసును రద్దుచేయాలని కోరారు.

రక్షణ ఎగుమతులు పెంచుతాం : మోడీ

శ్రీనగర్ : భారత్‌ను ప్రపంచంలోని రక్షణ ఎగుమతిదారుల్లో అగ్రశ్రేణిగా తీర్చిదిద్దుతామని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. జమ్ము కాశ్మీర్ ఉదంపూర్‌లోని కత్రాలో జరిగిన సమావేశంలో ప్రధాని ప్రసంగిస్తూ... ‘ఆత్మనిర్భర్ భారత్’ బలాన్ని ఆపరేషన్ సిందూర్ చాటి చెప్పిందని అన్నారు. గత దశాబ్దంలో ప్రముఖ రక్షణ ఎగుమతిదారుగా భారత్ అవతరించిందని, దేశాన్ని ప్రపంచంలోని అగ్రశ్రేణి రక్షణ ఎగుమతిదారులలో ఒకటిగా నిలపడమే తమ తదుపరి లక్ష్యమని అన్నారు. మార్కెట్లో ‘మేక్ ఇన్ ఇండియా’ గొప్పతనాన్ని కూడా నిలబెట్టాలని అన్నారు. దేశంలో తయారీ రంగాన్ని వేగవంతం చేసేందుకు ఈ ఏడాది బడ్జెట్‌లో మిషన్ మాన్యుఫ్యాక్చరింగ్ ఇనీషియేటివ్‌ను ప్రవేశపెట్టామని, అందులో జమ్ముకాశ్మీర్ యువ ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు చేరాలని అన్నారు.

జూన్ 16న బజాజ్ ఫైనాన్స్ బోనస్ షేర్లు

న్యూఢిల్లీ: బ్యాంకింగేతర విత్త సంస్థ బజాజ్ ఫైనాన్స్ తన వాటాదారులకు డబుల్ బోనంజా ప్రకటించింది. కంపెనీ బోర్డు 1:2 నిష్పత్తిలో షేర్ల విభజనకు ఆ కంపెనీ బోర్డు ఆమోదించింది. దీంతో రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతి ఈక్విటీ షేరును రూ.1 ముఖ విలువతో రెండు షేర్లుగా విభజిస్తారు. అప్పుడు షేరు ధర సగానికి తగ్గుతుంది. చిన్న ఇన్వెస్టర్లకు మరింత అందుబాటులోకి తెస్తుంది. దీంతో 100 షేర్లు ఉన్న ఇన్వెస్టర్లకు 200 షేర్లు లభించనున్నాయి. దీనికి రికార్డ్ తేదిని జూన్ 16గా నిర్ణయించింది.

డిఎస్సీ ప్రత్యేకం -ఎస్‌ఎ/ఎస్‌జిటి

జనరల్ నాలెడ్జ్ : కరెంట్ ఎఫైర్స్



కె.ఎస్.లక్ష్మణరావు,
మాజీ శాసనమండలి సభ్యులు,
సెల్ : 8309965083

నదీతీర నగరాలు

11. సూడాన్‌లోని ఖార్టూం నగరం ఏ నది ఒడ్డున ఉంది?
(ఎ) నైలునది (బి) హంబర్ (సి) ఇరావడీ (డి) టైబర్

12. ఈ క్రింది వాటిలో డాన్యూబ్ నది ఒడ్డున ఉన్న నగరం ఏది?
(ఎ) ఫిలడెల్ఫియా (బి) బెల్‌గ్రేడ్ (సి) షాంఘై (డి) లివర్‌పూల్

13. స్కాట్లాండ్‌లోని డుండీ నగరం ఏ నది ఒడ్డున ఉంది?
(ఎ) స్ప్రీ (బి) టే (సి) థేమ్స్ (డి) క్లైడీ

14. క్రింది వాటిలో మెయిజెన్‌సెన్ నది ఒడ్డున ఉన్న నగరం ఏదీ?
(ఎ) బ్యూనస్ ఎయిర్స్ (బి) వోల్గోగ్రాడ్ (సి) మాడ్రిడ్ (డి) క్యూబెక్

15. ఈ క్రింది వానిలో ‘వితావా’ నది ఒడ్డున ఉన్న నగరం ఏదీ?
(ఎ)పెర్త్ (బి) హల్ (సి) డబ్లిన్ (డి) పరాగ్వే

16. స్కాట్లాండ్‌లోని గ్లాస్కో నగరం ఏ నది ఒడ్డున ఉంది?
(ఎ) సుమిదా (బి) క్లైడీ (సి) ఎల్బె (డి) కాలదన్

17. కిందివాటిలో ‘కర్ణాపులి’ నది ఒడ్డున ఉన్న నగరం ఏది?.
(ఎ) చిట్టగ్యాంగ్ (బంగ్లాదేశ్ (బి) మాస్కో (రష్యా) (సి) బాన్ (జర్మనీ) (డి) మాంట్రియల్ (కెనడా)

18. జర్మనీలోని హంబర్గ్ నగరం ఏ నది ఒడ్డున ఉంది?
(ఎ) సీన్ (బి) అల్బె (సి) రైన్ (డి) నికియాంగ్

19. ఈ క్రింది వాటిలో ‘స్కెల్ట్’ నది ఒడ్డున ఉన్న నగరం ఏది?
(ఎ)మాడ్రిడ్ (బి) ఆంట్‌వెర్ప్ (సి) ఆక్వాబ్ (డి) బ్యాంకాక్

20. నెదర్లాండ్స్‌లోని ఆమ్‌స్టర్‌డామ్ నగరం ఏ నది ఒడ్డున ఉంది?
(ఎ) ఆమ్సెల్ (బి) మెనెమ్ (సి) అమెజాన్ (డి) సెయింట్ లారెన్స్

21. ఈ క్రింది వాటిలో ‘డార్లింగ్’ నది ఒడ్డున ఉన్న నగరం ఏది?
(ఎ)పారిస్ (బి) లండన్ (సి) సిడ్నీ (డి) వార్సా

22. అర్జెంటీనాలోని బ్యూనస్ ఎయిర్స్ నగరం ఏ వది ఒడ్డున ఉంది?
(ఎ) అమెజాన్ (బి) డార్లింగ్ (సి) లాప్లాటా (డి) వోల్గా



23. ఈ క్రింది వాటిలో అమెజాన్ నది ఒడ్డున ఉన్న నగరం ఏది?
(ఎ) మనావోస్ (బ్రెజిల్) (బి) బ్యాంకాక్ (థాయ్‌లాండ్) (సి) లండన్ (బ్రిటన్) (డి) పారిస్ (ఫ్రాన్స్)

24. కెనడాలోని మాంట్రియల్ నగరం ఏ నది ఒడ్డున ఉంది?
(ఎ) నెయిపర్ (బి) సెయింట్ లారెన్స్ (సి) రైన్ (డి) ఐరావతి

25. ఈ క్రింది వాటిలో ‘సుమిదా’ నది ఒడ్డున ఉన్న నగరం ఏది?
(ఎ) టోక్యో (జపాన్) (బి) వార్సా (పోలాండ్) (సి) రోమ్ (ఇటలీ) (డి) కాంటన్ (చైనా)

26. పోలాండ్‌లోని వార్సా నగరం ఏ నది ఒడ్డున ఉంది?
(ఎ) రైన్ (బి) స్కెల్ట్ (సి) విస్తులా (డి) నెవా

27. ఈ క్రింది వానిలో ‘డింబోవిట్స’ నది ఒడ్డునున్న నగరం ఏది ?
(ఎ) బుకారెస్ట్ (బి) ప్రేగ్ (సి) పారిస్ (డి) రోమ్

28. మయన్మార్‌లోని ఆక్వాబ్ నగరం ఏ నది ఒడ్డున ఉంది?
(ఎ)సల్వీన్ (బి) ఐరావతి (సి) కాలదన్ (డి) విస్తులా

29. ఈ క్రింది వాటిలో ‘అవో’ నది ఒడ్డునున్న నగరం ఏది?
(ఎ) బ్రిస్టల్ (ఇంగ్లాండ్) (బి) లివర్‌పూల్ (ఇంగ్లాండ్) (సి) లండన్ (ఇంగ్లాండ్) (డి) న్యూకాజిల్ (ఇంగ్లాండ్)

30. ఫిలడెల్ఫియా నగరం ఏ నది ఒడ్డున ఉంది?
(ఎ) పోటోమాక్ (బి) డెలవారే (సి) హడ్సన్ (డి) డాన్యూబ్

31. ఈ క్రింది వాటిలో యూఫ్రటిస్, టైగ్రిస్ నదుల ఒడ్డున ఉన్న నగరం ఏది?
(ఎ)టెహ్రాన్ (బి) కాబూల్ (సి) అబాదన్ (డి) బస్రా

32. ఈ క్రింది వాటిలో ‘నేవా’ నది ఒడ్డున ఉన్న నగరం ఏది?
(ఎ) మాస్కో (బి) కివ్ (సి) లెనిన్ గ్రాడ్ (డి) స్టాలిన్‌గ్రాడ్

33. పాకిస్తాన్‌లోని కరాచీ నగరం ఏ నది ఒడ్డున ఉంది?
(ఎ) రావి (బి) సింధు (సి) సట్లెజ్ (డి) చీనాబ్

34. ఈ క్రింది వాటిలో ‘మెర్సీ’ నది ఒడ్డున ఉన్న నగరం ఏది?
(ఎ) లివర్‌పూల్ (బి) ఒట్టావా (సి) మాంట్రియల్ (డి) న్యూయార్క్

35. టర్కీలోని అంకారా ఏ నది ఒడ్డున ఉంది?
(ఎ) టైన్ (బి) కిజిల్ (సి) సల్వీన్ (డి) ఎల్బె

36. ఈ క్రింది వాటిలో ‘మిసిసిపి’ నది ఒడ్డున ఉన్న నగరం ఏది?
(ఎ) వాషింగ్టన్ (బి) న్యూ అర్లియాన్స్ (సి) ఫిలడెల్ఫియా (డి) న్యూయార్క్

37. పాకిస్తాన్‌లోని లాహోర్ నగరం ఏ నది ఒడ్డున ఉంది?
(ఎ) రావి (బి) సట్లెజ్ (సి) చీనాబ్ (డి) సింధు

38. ఈ క్రింది వాటిలో ‘తగూస్’ నది ఒడ్డున ఉన్న నగరం ఏది?
(ఎ) లిస్బన్ (పోర్చుగల్) (బి) కొలోన్ (జర్మనీ) (సి) వియన్నా (ఆస్ట్రియా) (డి) బుడాపెస్ట్ (హంగేరీ)

39. జర్మనీలోని బాన్ నగరం ఏ నది ఒడ్డున ఉంది?
(ఎ) రైన్ (బి) స్ప్రీ (సి) అవో (డి) నైలు

40. ఈ క్రింది వాటిలో ‘హుగ్లీ’ నది ఒడ్డున ఉన్న నగరం ఏది?
(ఎ) అహ్మదాబాద్ (బి) అయోధ్య (సి) కోల్‌కొతా (డి) చెన్నై

41. ఉజ్జయిని నగరం ఏ నది ఒడ్డున ఉంది?
(ఎ) సువర్ణరేఖ (బి) సిప్రా (సి) కృష్ణ (డి) గంగ

42. ఈ క్రింది వాటిలో గంగానది ఒడ్డున ఉన్న నగరం ఏది?
(ఎ) సంబల్‌పూర్ (బి) ఔరంగాబాద్ (సి) అహ్మదాబాద్ (డి) హరిద్వార్

43. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య ఏ నది ఒడ్డున ఉంది?
(ఎ) కౌనా (బి) క్షిప్రా (సి) సరయు (డి) తపతి

44. ఈ క్రింది వాటిలో గోమతి నది ఒడ్డున ఉన్న నగరం ఏది?
(ఎ) లక్నో (బి) ఫిరోజ్‌పూర్ (సి)హైదరాబాద్ (డి) పూణే

45. అస్సాంలోని గౌహతి ఏ నది ఒడ్డున ఉంది?
(ఎ) నర్మదా (బి) బ్రహ్మపుత్ర (సి) పెరియార్ (డి) సింధు

46. ఈ క్రింది వాటిలో జీలం నది ఒడ్డునున్న నగరం ఏది?
(ఎ) లేహ్ (బి) జమ్‌షెడ్‌పూర్ (సి) పాట్నా (డి) శ్రీనగర్

47. మహారాష్ట్రలోని పూణె నగరం ఏ నది ఒడ్డున ఉంది?
(ఎ) వైగై (బి) ముతా (సి) మాండ్వి (డి) లూని

48. ఈ క్రింది వాటిలో యమునా నది ఒడ్డున ఉన్న నగరం ఏది?
(ఎ) ఢిల్లీ (బి) మొరాదాబాద్ (సి) లుధియానా (డి) హైదరాబాద్

49. విజయవాడ ఏ నది ఒడ్డున ఉంది?
(ఎ) మహానది (బి) తుంగభద్ర (సి) కృష్ణ (డి) గంగ

50. ఈ క్రింది వాటిలో సువర్ణరేఖ నది ఒడ్డున ఉన్న నగరం ఏదీ?
(ఎ) సూరత్ (బి) అజ్మీర్ (సి) జమ్‌షెడ్‌పూర్ (డి) అలహాబాద్

51. నాసిక్ నగరం ఏ నది ఒడ్డున ఉంది?
(ఎ) గోదావరి (బి) కృష్ణ (సి) బ్రహ్మపుత్ర (డి) గంగ

52. ‘లూని’ నది ఒడ్డున ఉన్న నగరం ఏది?
(ఎ) పనాజి (బి) అజ్మీర్ (సి) వారణాసి (డి) కోటా

53. గోవాలోని పనాజి ఏ నది ఒడ్డున ఉంది?
(ఎ) తపతి (బి) హుగ్లీ (సి) మాండ్వి (డి) సట్లెజ్

54. ఈ క్రింది వాటిలో ‘సబర్మతి’ నది ఒడ్డున ఉన్న నగరం ఏది?
(ఎ) అహ్మదాబాద్ (బి) శ్రీరంగపట్నం (సి) విజయవాడ (డి) జమ్‌షెడ్‌పూర్

55. పంజాబ్‌లోని లుథియానా నగరం ఏ నది ఒడ్డున ఉంది?
(ఎ) చీనాబ్ (బి) జీలం (సి) సట్లెజ్ (డి) ముతా





56. హైదరాబాద్ నగరం ఏ నది ఒడ్డున ఉన్నది?
(ఎ) మంజీరా (బి) పెన్‌గంగా (సి) కృష్ణా (డి) మూసీ

57. తిరుచ్చిరాపల్లి ఏ నది ఒడ్డున ఉంది?
(ఎ) యమున (బి) కావేరి (సి) కృష్ణ (డి) కౌనా

58. ఈ క్రింది వాటిలో ‘నర్మదా నది ఒడ్డున ఏ నగరం ఉంది?
(ఎ) జబల్‌పూర్ (బి) కాన్పూర్ (సి) పంథార్‌పూర్ (డి) సంబల్‌పూర్

59. మహారాష్ట్రలోని ఔరంగాబాద్ ఏ నది ఒడ్డున ఉంది?
(ఎ) మూసీ (బి) హుగ్లీ (సి) కౌనా (డి) వైగై

60. సంబల్‌పూర్ ఏ నది ఒడ్డున ఉంది ?
(ఎ) మహానది (బి) తుంగభద్ర (సి) నర్మదా (డి) గోదావరి

రేపటి సంచికలో : ప్రపంచంలో అతి ముఖ్యమైనవి

జవాబులు

(11) ఎ (12) బి (13) బి (14) సి (15) డి (16) బి (17) ఎ (18) సి (19) బి (20) ఎ (21) సి (22) సి (23) ఎ (24) బి (25) ఎ (26) సి (27) ఎ (28) సి (29) ఎ (30) బి (31) డి (32) సి (33) బి (34) ఎ (35) బి (36) బి (37) ఎ (38) ఎ (39) ఎ (40) సి (41) బి (42) డి (43) సి (44) ఎ (45) బి (46) డి (47) బి (48) ఎ (49) సి (50) సి (51).ఎ (52).బి (53).సి (54).ఎ (55).సి (56).డి (57).బి (58).ఎ (59).సి (60).ఎ.

సంపాదకీయం

హెచ్చరిక!

ఒక దేశ అభివృద్ధికి, సమాజ ఆరోగ్యానికి ఆ దేశ ప్రజల ఆయుర్దాయమే కొలమానం. 'జీవితం ఒక ప్రవాహం. అదెప్పుడూ ముందుకే సాగాలి, వెనుకకు కాదు' అంటారు రవీంద్రనాథ్ టాగూర్. 'వికసిత్ భారత్' అని నినాదాలిస్తున్నా... ప్రజల ఆయుష్షు మాత్రం వెనకడుగు వేస్తోంది. భారతదేశంలో ప్రజల ఆయుర్దాయం తగ్గినట్లు ఇటీవల వెలువడిన గణాంకాలు ఒకింత ఆందోళనకరమైనవే. దేశవ్యాప్తంగా ప్రజల సగటు ఆయుర్దాయం తగ్గిపోవడం గత 50 ఏళ్లలో ఇదే తొలిసారి. ఈ గణాంకాలు కేవలం సంఖ్యలు మాత్రమే కాదు, సమాజ ఆరోగ్య స్థితికి ప్రతిబింబాలు. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో ఆయుర్దాయం మరింత తగ్గిందని నివేదికలు చెబుతున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం... దేశంలో 5.5శాతం మంది మురికివాడల్లో నివసిస్తున్నారు. పోషకాహార లోపంతో పిల్లలు, మహిళలు, వృద్ధులు ఎక్కువగా అనారోగ్యానికి గురవుతున్నారు. పట్టణాల్లో మెరుగైన వైద్యసేవలు అందుబాటులో వున్నప్పటికీ... ఆధునిక జీవనశైలి వల్ల సంభవించే వ్యాధులు ఆయుర్దాయంపై ప్రభావం చూపుతున్నాయి. ఇది ఆయుష్షును తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. 'మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవాలి. అది ఎవరి చేతుల్లోనూ లేదు' అంటారు గాంధీజీ.

భారత ప్రజల సగటు ఆయుఃప్రమాణం 70 ఏళ్లు కాగా, బంగ్లాదేశ్ 74, చైనా 79, అమెరికా 79, ఇంగ్లాండు 82, ఫ్రాన్స్ 83, జపాన్ 85, మొనాకో 86 ఏళ్లు. కానీ, ఒక్క భారత్‌లో మాత్రమే సగటు ఆయుఃప్రమాణంలో స్వల్ప తగ్గుదల నమోదైంది. కేంద్ర ప్రభుత్వ తాజా గణాంకాల ప్రకారం... దేశ వ్యాప్తంగా ప్రజల ఆయుఃప్రమాణం గతంతో పోలిస్తే సగటున రెండు నెలల కాలం తగ్గినట్లు తేలింది. ఈ గణాంకాల ఆధారంగా 'డౌన్ టు ఎర్త్' ప్రచురించిన కథనం చర్చనీయాంశంగా మారింది. రెండు నెలల కాలం తక్కువగానే కనిపించినప్పటికీ మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఆయుఃప్రమాణాల లెక్కల్లో తగ్గుదల నమోదు కావడం ఇదే మొదటిసారి. 2016-2020 మధ్య 70 ఏళ్లుగా ఉన్న జీవిత కాలం... 2017-2021 మధ్య కాలంలో 69.8 ఏళ్లకు తగ్గింది. గ్రామీణ ప్రాంతాల్లో సగటున ఒక నెల కాలం, పట్టణ ప్రాంతాల్లో సగటున మూడు నెలల కాలపు జీవితకాలం తగ్గినట్లు తేల్చారు. ఆంధ్రప్రదేశ్‌లో 2016-20లో 70.6 సంవత్సరాలు సగటు జీవన ప్రమాణం నమోదు కాగా, 2017-21లో 70.3 నెలల కాలం నమోదైంది. జీవన ప్రమాణాలపై పడుతున్న కోత...ఆయుఃప్రమాణాలపై ప్రభావం చూపుతోందని ఇప్పటికే అనేక నివేదికలు చెబుతోన్న మాట. దేశంలో వాయు కాలుష్యం కూడా నానాటికీ పెరిగిపోతోంది. దీనివల్ల ప్రజల సరాసరి ఆయుర్దాయం 5.3 ఏళ్లు తగ్గిపోతుందని తాజాగా ఓ అధ్యయనం హెచ్చరించింది. 'ఆనందం అర్ణవమైతే/ అనురాగం అంబరమైతే/ అనురాగపుటంచులు చూస్తాం/ ఆనందపు లోతులు తీస్తాం..' అంటాడు మహాకవి శ్రీశ్రీ. ఈ ఏడాది ప్రపంచంలోనే అత్యంత ఆనందమయ దేశాల జాబితాలో భారత్ 118వ స్థానంలో నిలిచింది. దేశంలో మారుతున్న ప్రజల జీవనశైలికి, ఆవిరైపోతున్న ఆనందానికి ఇది నిదర్శనం.

'జీవితం ఓ ప్రయాణం అయితే, ఆయుష్షు దానికి ఇంధనం. అది క్షీణిస్తే.. మన గమ్యం ఆగిపోతుంది' అంటాడో రచయిత. పౌష్టికాహారం, కాలుష్య రహిత వాతావరణం, రక్షిత మంచినీరు, వైద్య, ఆరోగ్య సౌకర్యాలు, మానసిక ప్రశాంతత వంటి అనేక కారణాలు ఆయుఃప్రమాణాలు మెరుగుదలకు దోహదపడతాయని నిపుణులు చెబుతున్నారు. దోపిడీ మోతల వికసిత భారతంలోని గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వైద్యులు అందుబాటులో వుండాలి. ఈ ప్రమాణాలను సాధించినప్పుడే ప్రజల ఆయుర్దాయం మళ్లీ పెరుగుతుంది. 'ప్రతి మార్పు ఒక చిన్న అడుగుతోనే ప్రారంభమౌతుంది' అంటారు. ప్రజా సంక్షేమానికి తిలోదకాలిచ్చి... కార్పొరేట్ల సేవలో తరిస్తున్న ప్రభుత్వాలకు, గణాంకాల వెనుక గోచరిస్తున్న ఈ హెచ్చరిక ఓ గుణపాఠం కావాలి. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుదలకు ప్రభుత్వాలు బాధ్యత వహించాలి. 'ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం అంటే, భవిష్యత్తును నిర్లక్ష్యం చేయడమే' అంటారు విక్టర్ హ్యూగో. దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే, ప్రజల ఆయుర్దాయం పెరగాలి. ప్రభుత్వాలు ఆరోగ్య రంగానికి పెద్దపీట వేయాలి. ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలి. అప్పుడే ప్రజల ఆయుఃప్రమాణాల్లో మెరుగుదల నమోదవుతుంది.

మహనీయుని మాట



ట్రేడ్ యూనియన్ తటస్థత అనేది పక్కా బూర్జువా భావన. నిజానికి ఏ దేశంలోనూ, ఎన్నడూ ట్రేడ్ యూనియన్లు తటస్థంగా ఉండలేదు. అవి పెట్టుబడిదారీ వర్గానికి వ్యతిరేకంగా కృతనిశ్చయంతో పోరాడతాయి. లేకుంటే ఏదో ఒక రూపంలో బూర్జువా వర్గానికి సేవ చేయడంలో నిమగ్నమైనాయి.

- జార్జి డిమిట్రోవ్

దక్షిణాదిన భాషా వివాదం, బిజెపి పాచిక

ప్రస్తుతం



తెలకపల్లి రవి

కమల్‌హాసన్, మణిరత్నం కాంబినేషన్లో దశాబ్దాల తర్వాత వచ్చిన సినిమా 'థగ్ లైఫ్' సరిగ్గా ఆడకపోయినా ఆ నేపథ్యంలో అనుకోకుండా వచ్చిన ఒక వివాదాన్ని మాత్రం బిజెపి బాగా పెద్దది చేస్తున్నది. కర్ణాటక తప్ప మిగిలిన దక్షిణాది రాష్ట్రాల్లో తనకంటూ పెద్ద పునాది లేని బిజెపి ఆ ఒక్కచోట మళ్లీ పుంజుకోవడానికి ఈ వివాదాన్ని సాధనంగా చూస్తున్నదా అని సందేహం కలుగుతుంది. అదే సమయంలో...తమిళ, కన్నడ భాషల అనుబంధం గురించి కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యల నిజానిజాలు కూడా ప్రజలు ఆలోచిస్తున్నారు. ఆ అంశంలో మరింత స్పష్టత కోసం ప్రయత్నించవచ్చు. విమర్శించుకోవచ్చు. అంతేకానీ ప్రజల మధ్య, ప్రాంతాల మధ్య విభేదాలు, వివాదాలు పెంచాలని చూడటం మటుకు వాంఛనీయం కాదు. నటుడు ప్రకాష్‌రాజ్ లాగే కమల్‌హాసన్ కూడా- ప్రధానంగా తమిళనాడులో బిజెపి కూటమికి, దాని మత రాజకీయాలకు వ్యతిరేకంగా నిలబడుతున్న వ్యక్తి. మొదటి లోక్‌సభ ఎన్నికల్లో డిఎంకె కూటమిని బలపరిచి తన మక్కల్ నీది మయ్యం పార్టీని పోటీకి దూరంగా ఉంచారు. ప్రస్తుతం ఆయన తమిళనాడు ఇండియా వేదిక రాజ్యసభకు పంపిస్తున్నది. ఆయన మాటలపై మంట పెట్టడంలో బిజెపికి ఆ కడుపు మంట కూడా ఉంటుందనేది స్పష్టం. ప్రకాష్‌రాజ్ విషయంలోనైతే ఎప్పటికప్పుడు దాడి చూస్తూనే ఉంటాం. ఇంటింటికి సింధూరం తీసుకువెళ్తామని ఈ మధ్య మోడీ చేసిన వ్యాఖ్యపై ఆయన స్పందిస్తూ 'ఈ వృద్ధుడు కుంకుమ తీసుకుపోతే ఎవరు తీసుకుంటారని' ప్రశ్నించారు. భాషా పరంగా గాని, సంప్రదాయ కోణంలో కానీ ఈ మాటల్లో పెద్ద తప్పేమీ లేదు. అయినా అదేదో భారతీయ మహిళలను కించపరిచినట్టుగా రభస చేయడానికి విఫల యత్నం చేసింది.

ప్రేమ పూర్వకంగానే...

తన సినిమా ప్రమోషన్‌లో భాగంగా మీడియా షో నిర్వహించిన కమల్‌హాసన్ వాస్తవానికి బహు భాషా నటుడు. దక్షిణాదిన అన్ని భాషల్లోనూ ఆయన చిత్రాలు విజయవంతం కావడమే కాదు, 50 ఏళ్ల కిందటే హిందీలోనూ సత్తా చూపిన ప్రతిభావంతుడు. ఆ మాటకొస్తే ఆయన సమకాలికుడైన రజనీకాంత్ అసలు కన్నడ సీమ నుంచే వచ్చినవారు. కన్నడం, తమిళం ఒకటేనంటూ అనుబంధం చాటడానికి కమల్‌హాసన్ ఉత్సాహంలో తమిళం నుంచి కన్నడం పుట్టిందని భాషావేత్తలు చెప్పారని అన్నారు. ఆయన ఈ మాటలు అన్నప్పుడు పక్కన ప్రఖ్యాత కన్నడ హీరో రాజ్‌కుమార్ పుత్రుడైన శివరాజ్ కుమార్ కూడా ఉన్నారని గుర్తుంచుకోవాలి. కావేరి జలాలతో సహా రెండు రాష్ట్రాల మధ్య కొన్ని సమస్యలు ఉన్న మాట నిజమైనా అనుబంధం కూడా చాలా ఎక్కువ. తాను ఆ స్నేహభావాన్ని చాటడానికే మాట్లాడానని కమల్ పదే పదే వివరించారు. అయినా ఆయన కన్నడాన్ని అవమానించారని, క్షమాపణలు చెప్తే తప్ప సినిమా విడుదల కానీయబోమని ఈ వర్గాలు రభస సృష్టించాయి. ప్రధాన ప్రతిపక్షమైన బిజెపి ఈ వైఖరి తీసుకున్నప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కూడా కొంతవరకూ అదే తరహాలో మాట్లాడారు. వీటన్నిటి తర్వాత... కమల్‌హాసన్ ఆ మాటలు వెనక్కు తీసుకుంటేనే ఆయన సినిమా కన్నడ వెర్షన్ విడుదలకు ఒప్పుకుంటామని కర్ణాటక ఫిలిం ఛాంబర్ షరతు పెట్టింది. తాను ప్రేమతో ఆ మాట అన్నాను తప్ప మరో విధంగా కాదని, ప్రేమ క్షమాపణలు చెప్పదని కమల్ స్పష్టీకరించారు. ఆశ్చర్యం ఏమంటే కర్ణాటక హైకోర్టు కూడా దీనిపై అవసరాన్ని మించి స్పందించడమే కాక క్షమాపణలు చెప్పి తీరాలని సూచించింది. మీరు ఏమైనా చరిత్రకారులా భాషానిపుణులా అని ఆగ్రహం వ్యక్తం చేసింది. సంస్కృతి, మతం పేరుతో కీలక పదవుల్లో ఉన్న నాయకులు రకరకాలుగా మాట్లాడినప్పుడు మిన్నకుండిపోయిన ఉన్నత న్యాయస్థానాలు సమస్య లేని చోట వివాదం పెంచే వ్యాఖ్యలు చేయడం ఇక్కడ గమనించవచ్చు. అయితే ఆయన తన చిత్రాన్ని కన్నడలో విడుదల చేయరాదని క్షమాపణల ప్రసక్తి లేదని ప్రకటించారు. అదే సమయంలో తన స్నేహపూర్వక వ్యాఖ్యలను వివరిస్తూ చాంబర్‌కు లేఖ కూడా రాశారు. ఈ లోగా ఇతర రాష్ట్రాలలో ఆ చిత్రం విడుదల, విఫలం కూడా సంభవించాయి.

చరిత్ర వాస్తవాలేమిటి?

ఇంతకూ మనం ఆ వ్యాఖ్యలను ఎలా చూడాలి? దక్షిణాది భాషలైన తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, తుళు ఒకే కుదురు నుంచి వచ్చాయని భాషావేత్తలు మొదటి నుంచీ భావిస్తున్నారు. అదే ఆది ద్రావిడ భాష. ఈ క్రమంలో ముందు తమిళ భాష విడిపోయిందని ఒక బలమైన అభిప్రాయం ఉంది. తమిళ భాషా సాహిత్య ఆధారాలు మిగిలిన వాటికంటే ప్రాచీన కాలం నుంచి లభ్యం కావడం ఇందుకు ప్రధాన కారణం. క్రీస్తుపూర్వం సంగం సాహిత్యం అనేది తమిళంలో తొలి వారసత్వంగా పరిగణిస్తారు. ఇందులో బౌద్ధ, జైన కథలు కూడా అనేకం ఉంటాయి. కన్నడంలో 8వ శతాబ్ది నుంచి సాహిత్యం లభిస్తున్నది. తెలుగుకు వస్తే 11వ శతాబ్ది నాటి నన్నయ్య భారతాన్ని ఆదికావ్యమంటూ ఇటీవల వరకు గొప్పగా చెప్పేవారు. 1000 ఏళ్ల తెలుగు సాహిత్యం అన్న మాట అలా పుట్టిందే. ఈ మూడు భాషలు ఒకదాని నుంచి ఒకటి వచ్చాయని చెప్పడానికి ఆధారాలు లేకపోయినా అన్ని ఒకే కుదురు అన్నది మాత్రం దాదాపు కచ్చితంగా ఒప్పుకున్నదే. భారతదేశంలోనే ప్రఖ్యాతిగాంచిన భాషావేత్త డాక్టర్ భద్రిరాజు కృష్ణమూర్తి దగ్గర నుంచి పాశ్చాత్య పరిశోధకుల వరకు ఈ అంశాన్ని ధ్రువీకరించారు. బహుశా కమల్ ఉద్దేశం కూడా ఇదే అయి ఉండవచ్చు. అపార్థం ఉంటే సవరించుకోవచ్చు కానీ క్షమాపణలు, భాషా యుద్ధాలు అవసరమేముంది? తమిళనాడు సిపిఎం కార్యదర్శి షణ్ముగం ఒక సభలో మాట్లాడుతూ ఇదే చెప్పారు. తమిళనాడులో కాలూనితే చాలని, కర్ణాటకలో ఎలాగో మళ్లీ అధికారంలోకి రావాలని తంటాలు పడుతున్న బిజెపి దీన్ని కావాలనే పెద్దది చేస్తున్నది. వారికి తమిళనాడులో అవకాశం తక్కువ. పైగా అక్కడ కమల్ ప్రత్యర్థి శిబిరంలో వున్నారు. మొన్న లోక్‌సభ ఎన్నికల్లో 100 శాతం ఇండియా స్ట్రయిక్ రేట్‌కు కలసి వచ్చారు. ముందే చెప్పినట్టు లౌకికవాదంతో నిలబడుతున్న ఈ ప్రముఖ నటుల పట్ల ద్వేషం కూడా ఇందుకు కారణం అని చెప్పాలి. ఈ వివాదంలో కమల్ యథాలాపంగా స్నేహపూర్వకంగా మాట్లాడిన దానికి, బిజెపి వర్గాలు రాజకీయ వ్యూహాలతో చేస్తున్న దానికి మధ్య తేడా కాదనలేనిది. ముందు వెనకలు అలా ఉంచితే దక్షిణాది భాషల మధ్య అనుబంధం చెరిపివేయలేనిది. దేశం మొత్తం మీద హిందీ భాషను బలవంతంగా రుద్దాలని, అసలు భాషా ప్రయుక్త రాష్ట్రాల హక్కులను హిందీ హిందూత్వతో అణగదొక్కాలని చూస్తున్న సంఘపరివార్ ఇలాంటి హడావుడి చేయటం మరింత హాస్యాస్పదం.

సనాతనంతో వెనక్కు...

సనాతనవాదం ముదిరిపోయిన వారు ఏదైనా మాట్లాడవచ్చు కానీ సామాజిక, రాజకీయ విషయాల్లో లాగే భాషాపరమైన అంశాల్లో కూడా దాని ప్రభావం కాదనలేనిది. 20 ఏళ్ల కిందట అప్పటి యుపిఎ ప్రభుత్వం తమిళానికి ప్రాచీన హోదా ఇవ్వడం చర్చకు దారి తీసింది. తెలుగు కూడా హోదా ఇవ్వాలని పెద్ద ఉద్యమమే నడిచింది. ఆ క్రమంలో కాస్త ముందు వెనకగా దాంతోపాటు సంస్కృతం, కన్నడ, మలయాళ భాషలకు కూడా ప్రాచీన హోదా వచ్చింది. పాళీ, ప్రాకృత, అస్సామీ, బెంగాలీ, మరాఠా, ఒడియా భాషలూ ప్రాచీన జాబితాలో స్థానం పొందాయి. ఇందులో చెమ్మిలన్ అనే ప్రాచీన నామంతో తమిళం క్రీస్తుపూర్వం 300కు ముందు నాటిదని చెబుతారు. ప్రాచీన భాష, దైవ భాష అనే సంస్కృతంలో సాహిత్యం దాని తర్వాత వందేళ్లకు కాని లభించలేదు. కన్నడంలో క్రీశ 8వ శతాబ్దిలో సాహిత్యం లభిస్తున్నది. ఇక తెలుగు భాషకు క్రీస్తు ఆరో శతాబ్ది నుంచి శాసనాలు దొరికాయి. తెలుగు భాషాభిమానులు, పరిశోధకులు చూపించే ఆధారాలు అంతకన్నా వందల సంవత్సరాల వెనక్కు వుంటాయి. అంచనాల్లో ఈ హెచ్చుతగ్గులకు చారిత్రక కారణాలు కూడా ఉన్నాయి. తెలుగు తీసుకుంటే 11వ శతాబ్ది నాటి భారతాన్ని కవి నన్నయను ఆది కవిగా చెప్పడం సంప్రదాయకారులు చేసిన పని. ఒక భాషలో మహాకావ్యం హఠాత్తుగా ఉద్భవించదు. దానికన్నా చాలా కాలం ముందు నుంచి శాసనాల్లో, జానపదాల్లో, ప్రజల నుడిలో తెలుగు సజీవంగా ఉంది. కానీ పండితమ్మన్యులు గుర్తించక పోగా గ్రామ్య భాషగా ఈసడించారు. అసలు బౌద్ధ జైనాలతో సహా వైదికేతర సాహిత్య సంపదను కావాలనే నిర్లక్ష్యం చేశారు. 'అన్నమయ్య' సినిమాలో చూపించినట్టుగా వాటిని నాశనం చేయడానికి కూడా ప్రయత్నించారు. ఆయనకు అంతటి ప్రాచుర్యం రావడానికి చాలా సమయం పట్టింది. మనకు తెలిసి వేమన పద్యాలనే తొక్కిపడితే బ్రౌన్ తీయాల్సి వచ్చింది. ఒక ముక్కలో చెప్పాలంటే ఆదికవులను కీర్తిస్తూ 'సోది' కవులను విస్మరించడం వల్లనే తెలుగు భాషా చరిత్రకు కూడా హాని కలిగింది. అదే తమిళులు సంగం సాహిత్యాన్ని సగర్వంగా నిలబెట్టుకున్నారు. కనుక వారికి చరిత్ర ఎక్కువగా దొరుకుతున్నది. నన్నయ్య భారతం రచనకు కన్నడ నారాయణభట్టు సహకరించారు. నారాయణభట్టు కూడా తెలంగాణ ప్రాంతానికి చెందిన వారంటారు. తెలుగులో కన్నడ, తమిళ పదాలు కూడా వందల సంఖ్యలో వున్నాయి. కన్నడ నారాయణ భట్టు తెలుగు భారతానికి సహకరించడంలో పాఠాలు మరవరానివే. తెలుగు, తెలంగాణ భాష వేరన్నట్టు కొంతమంది వాదించినా అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రపంచ తెలుగు మహాసభలే నిర్వహించారు. ఇటీవల రేవంత్ ప్రభుత్వం తెలుగు చిత్రాలన్నింటికీ కలిపి అవార్డులు ప్రకటించటం కూడా చూశాం. కన్నడ, తమిళ వివాదమే వద్దంటుంటే తెలుగు భాషా ప్రయోగాల్లో ఎన్ని తేడాలున్నా వేరువేరుగా చూడటం సాధ్యమైంది కాదు. ఏమైనా ఈ పూర్వ రంగంలో చూస్తే దక్షిణాన భారత భాషల మధ్య అనుబంధం మౌలికమైనదని, ప్రాచీనమైందని స్పష్టంగా తెలుస్తుంది.

'వీరమల్లు' కూడా వెనక్కు!

ఈ సమయంలోనే సనాతనం తాలూకూ మరో పార్శ్వం కూడా సినీనటుల నుంచే చూడటం ఆసక్తికరం. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ 'హరిహర వీరమల్లు' కూడా 'థగ్ లైఫ్' కన్నా ముందు నుంచే విడుదల ప్రచారం చేసుకుంది. దాని విడుదల అడ్డుకోవడానికి సింగిల్ థియేటర్ల పేరిట కుట్ర జరిగిందని సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ మాత్రమేగాక స్వయంగా ఆయన కార్యాలయం కూడా హడావుడి చేసింది. రెండు తెలుగు రాష్ట్రాలలో అది పెద్ద వివాదంగా మారింది. వీరమల్లు కూడా ఔరంగజేబ్ కాలం నాటితో ముడిపెట్టిన సనాతన పాన్ ఇండియా సిరీస్‌లో భాగమే! వింత వివాదం నడిపి దీన్ని విడుదల చేసింది కూడా లేదు. రాజకీయ సినీ సాంస్కృతిక మత విషయాలను కలగాపులగం చేసి ప్రజల దృష్టిని ఎలా దారి మళ్లిస్తున్నారో దీన్ని బట్టే తెలుస్తుంది. తాజాగా డిప్యూటీ సిఎం కార్యాలయం గో సంరక్షణపై చేసిన ట్వీట్ కూడా ఈ కోవలోదే. గోవులను గౌరవించడం, పూజించడం వారి వారి ఇష్టం. అయితే బక్రీద్ సందర్భంగా దొంగతనంగా గోవులను తరలించుకుపోయే ప్రమాదం వుందని ఉప ముఖ్యమంత్రి కార్యాయం మరో మతం పండుగతో ముడిపెట్టి హెచ్చరించడమేమిటి? అది వారిపై సందేహం వెలిబుచ్చడమే కదా? ఈ సమయంలోనే సుప్రీం కోర్టు ముందుకు ఇలాంటి ఆరోపణ ఒకటి పిల్ రూపంలో వస్తే విచారించేందుకు నిరాకరించింది. ఢిల్లీలో బిజెపి ప్రభుత్వం కూడా ఇలాంటి సర్క్యులర్ ఇచ్చింది గానీ మరీ ఇంత సూటిగా కాదు. ఇప్పటి వరకూ చెప్పుకున్న కర్ణాటకలో బజరంగదళ్ మాత్రమే ఇలాంటి ప్రచారం ఎత్తుకుంది. ఎపి ప్రభుత్వంలో రెండవ స్థానంలో వున్న పవన్ అధికారికంగా అదే వాదన చేయడం చంద్రబాబు ప్రభుత్వ అధికారిక ఆలోచనగా వుంటుందా? భాష, మతం, ఆచారం ఏ విషయంలోనైనా సరే ప్రజల మధ్య విభజన పెంచే చర్యలు మాత్రం అనుమతించరానివి. ★




తమిళనాడులో కాలూనితే చాలని, కర్ణాటకలో ఎలాగో మళ్లీ అధికారంలోకి రావాలని తంటాలు పడుతున్న బిజెపి దీన్ని కావాలనే పెద్దది చేస్తున్నది. వారికి తమిళనాడులో అవకాశం తక్కువ. పైగా అక్కడ కమల్ ప్రత్యర్థి శిబిరంలో వున్నారు. మొన్న లోక్‌సభ ఎన్నికల్లో 100 శాతం ఇండియా స్ట్రయిక్ రేట్‌కు కలసి వచ్చారు. ముందే చెప్పినట్టు లౌకికవాదంతో నిలబడుతున్న ఈ ప్రముఖ నటుల పట్ల ద్వేషం కూడా ఇందుకు కారణం అని చెప్పాలి. ఈ వివాదంలో కమల్ యథాలాపంగా స్నేహపూర్వకంగా మాట్లాడిన దానికి, బిజెపి వర్గాలు రాజకీయ వ్యూహాలతో చేస్తున్న దానికి మధ్య తేడా కాదనలేనిది. ముందు వెనకలు అలా ఉంచితే దక్షిణాది భాషల మధ్య అనుబంధం చెరిపివేయలేనిది. దేశం మొత్తం మీద హిందీ భాషను బలవంతంగా రుద్దాలని, అసలు భాషా ప్రయుక్త రాష్ట్రాల హక్కులను హిందీ హిందూత్వతో అణగదొక్కాలని చూస్తున్న సంఘపరివార్ ఇలాంటి హడావుడి చేయటం మరింత హాస్యాస్పదం.

కావేరి జలాలతో సహా రెండు రాష్ట్రాల మధ్య కొన్ని సమస్యలు ఉన్న మాట నిజమైనా అనుబంధం కూడా చాలా ఎక్కువ. తాను ఆ స్నేహభావాన్ని చాటడానికే మాట్లాడానని కమల్ పదే పదే వివరించారు. అయినా ఆయన కన్నడాన్ని అవమానించారని, క్షమాపణలు చెప్తే తప్ప సినిమా విడుదల కానీయబోమని ఈ వర్గాలు రభస సృష్టించాయి. ప్రధాన ప్రతిపక్షమైన బిజెపి ఈ వైఖరి తీసుకున్నప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కూడా కొంతవరకూ అదే తరహాలో మాట్లాడారు. వీటన్నిటి తర్వాత...కమల్‌హాసన్ ఆ మాటలు వెనక్కు తీసుకుంటేనే ఆయన సినిమా కన్నడ వెర్షన్ విడుదలకు ఒప్పుకుంటామని కర్ణాటక ఫిలిం ఛాంబర్ షరతు పెట్టింది. తాను ప్రేమతో ఆ మాట అన్నాను తప్ప మరో విధంగా కాదని, ప్రేమ క్షమాపణలు చెప్పదని కమల్ స్పష్టీకరించారు. ఆశ్చర్యం ఏమంటే కర్ణాటక హైకోర్టు కూడా దీనిపై అవసరాన్ని మించి స్పందించడమే కాక క్షమాపణలు చెప్పి తీరాలని సూచించింది. మీరు ఏమైనా చరిత్రకారులా, భాషా నిపుణులా అని ఆగ్రహం వ్యక్తం చేసింది. సంస్కృతి, మతం పేరుతో కీలక పదవుల్లో ఉన్న నాయకులు రకరకాలుగా మాట్లాడినప్పుడు మిన్నకుండి పోయిన ఉన్నత న్యాయ స్థానాలు సమస్య లేని చోట వివాదం పెంచే వ్యాఖ్యలు చేయడం ఇక్కడ గమనించవచ్చు.

సాగరాన్ని కాపాడుకుందాం

సందర్భం

వాస్తవం ఏమిటంటే, మనం సాగరం నుండి...అది తిరిగి పునరుత్పత్తి చేయగలిగే దానికంటే ఎక్కువ తీసుకుంటున్నాం. 90 శాతం పెద్ద చేపల సంఖ్య తగ్గిపోయి, 50 శాతం పగడపు దిబ్బలు నాశనం కావడంతో, ఈ అసమతుల్యత స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ప్రపంచ సాగర దినోత్సవం, సాగరంతో మనకు ఉన్న లోతైన అనుబంధాన్ని శక్తివంతంగా గుర్తుచేస్తుంది.



జూన్ 8వ తేదీని క్యాలెండర్లలో గీసుకుని పెట్టుకోండి మిత్రులారా! ఈ రోజు ప్రపంచమంతా ఏకమై ప్రపంచ సాగర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటుంది. ఇది కేవలం పండగ కాదు. మన సాగరాలను, వాటిలోని జీవరాశిని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యతను గుర్తుచేసే ఓ మహత్తర సందర్భం. నిజానికి, ఈ రోజుల్లో ఇది గతంలో ఎన్నడూ లేనంత అత్యవసరం. ఈ సంవత్సరం ఈ దినోత్సవానికి ఎంచుకున్న నినాదం, "అద్భుతం: మనకు ఆధారాన్నిచ్చే సాగరాన్ని నిలబెట్టుకుందాం". ఇది మనకూ, సాగర ప్రపంచానికీ ఉన్న అపారమైన బంధాన్ని, దాని జీవశక్తిని వెంటనే పునరుద్ధరించాల్సిన ఆవశ్యకతను అద్భుతంగా తెలియజేస్తోంది.

ప్రపంచ సాగర దినోత్సవం ఎందుకు?

మన భూమి ఉపరితలంపై ఏకంగా 70 శాతం ఆవరించి ఉన్న సాగరాలు కేవలం నీటి రాశులు మాత్రమే కాదు. అవి ఈ భూమికి ప్రాణం, సమస్త జీవరాశి మనుగడకు అత్యంత కీలకమైన పనులు చేస్తాయి. మనం పీల్చే ఆక్సిజన్‌లో కనీసం సగానికి పైగా సాగరాలే ఉత్పత్తి చేస్తాయి. కోట్లాది మందికి అన్నం పెట్టి, ప్రపంచంలోని 80 శాతం జీవ వైవిధ్యాన్ని తమ ఒడిలో చేర్చుకుని, సాగరం మన మనుగడకు ప్రధాన ఆధారం. ఆర్థికంగా కూడా ఇది చాలా కీలకం. 2030 నాటికి సుమారు 4 కోట్ల మంది సాగర ఆధారిత పరిశ్రమల్లో బతుకుతెరువు పొందవచ్చని అంచనా. అయినప్పటికీ, ఈ అమూల్యమైన ప్రకృతి సంపద ఇప్పుడు ఊహించని ప్రమాదాలను ఎదుర్కొంటోంది. దశాబ్దాల తరబడి మనిషి చేసిన కార్యకలాపాలు మన సాగరాలను పతనం అంచుకు నెట్టేశాయి. దీనివల్ల సాగర పర్యావరణ వ్యవస్థలకు, తద్వారా మానవ జాతికి తీవ్ర పరిణామాలు తప్పడం లేదు. ప్రపంచ సాగర దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యం సాగర సౌందర్యాన్ని ఆస్వాదించడం ఒక్కటే కాదు, మనిషి వల్ల కలిగే నష్టాలను ప్రజలకు తెలియజేయడం, సాగర సంరక్షణ కోసం ప్రపంచవ్యాప్తంగా ఒక ఉద్యమాన్ని తేవడం, సాగరాల స్థిరమైన నిర్వహణ కోసం ప్రపంచాన్ని ఏకం చేయడం.

అతిగా చేపల వేట

సాగర జీవనం, జీవ వైవిధ్యానికి తగులుతున్న అతి పెద్ద దెబ్బల్లో ఒకటి అతి చేపల వేట. చేపలను వాటి పునరుత్పత్తి సామర్థ్యం కంటే వేగంగా, ఎక్కువగా పట్టినప్పుడు ఇది జరుగుతుంది, ఫలితంగా వాటి సంఖ్య అడుగంటిపోతుంది. గణాంకాలు మనల్ని కలవర పెడుతున్నాయి. 2024 నాటికి, ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ పర్యవేక్షిస్తున్న 500 చేపల నిల్వల్లో 37 శాతం పైగా వేటాడుతున్నారని అంచనా-ఇది 1970తో పోలిస్తే మూడు రెట్లు ఎక్కువ! అతిగా చేపల వేట వల్ల కలిగే పరిణామాలు చాలా భయంకరమైనవి. కుప్పకూలుతున్న చేపల సంఖ్య సాగర జీవ వైవిధ్యాన్ని నాశనం చేస్తుంది. పర్యావరణ వ్యవస్థల సున్నితమైన సమతుల్యతను చిందరవందర చేస్తుంది. సముద్రపు ఆహారంపై ఆధారపడే లక్షలాది మంది ప్రజల జీవనోపాధిని, ఆకలిని ప్రమాదంలో పడేస్తుంది. 1992లో కెనడాలోని గ్రాండ్ బ్యాంక్స్ కాడ్ ఫిషరీ మొత్తం నాశనం కావడం, దానివల్ల 35,000 మంది మత్స్యకారులు నిరుద్యోగులు కావడం, ఒక గుణపాఠం లాంటిది. 2024 ప్రపంచ ఆక్వా కల్చర్ స్థితి (సోఫియా) నివేదిక ఈ సంక్షోభాన్ని మరింత స్పష్టం చేసింది. చేపల నిల్వల్లో మూడింట ఒక వంతుకు పైగా (37.7 శాతం) స్థిరమైన పరిమితులను మించి వేటాడుతున్నారు.

అనుకోకుండా చిక్కిన చేపలు - కనిపించని నష్టం

చేపలను ఉద్దేశపూర్వకంగా పట్టడంతో పాటు, అనుకోకుండా చేపలు చిక్కడం పరిస్థితిని మరింత తీవ్రం చేస్తాయి. చేపల వేట సమయంలో అనుకోకుండా వలలో పడే సముద్ర జాతులకు కూడా దీనివల్ల ప్రమాదం ఏర్పడుతుంది. ఈ విచక్షణారహిత పద్ధతి తాబేళ్లు, డాల్ఫిన్లు వంటి అంతరించిపోతున్న జాతుల ప్రాణాలకు ముప్పు తెస్తుంది. ఇది ఇతర జాతులు ఆహారంగా ఆధారపడే చేపలను తొలగించడం ద్వారా ఆహార గొలుసును కూడా దెబ్బతీస్తుంది. చిన్న చేపల సంఖ్యను నాశనం చేస్తుంది. అవి పునరుత్పత్తి వయస్సుకు చేరకుండా అడ్డుకుంటుంది. గత 50 సంవత్సరాలలో చేపల వేట వల్ల సాగర జీవవైవిధ్యం కోల్పోవడం మన సాగరాలపై అత్యంత తీవ్రమైన ప్రభావాన్ని చూపింది.

వాతావరణ మార్పులతో ప్రమాదం

వాతావరణ మార్పు ప్రభావం మన సాగరాలపై వేగంగా పడుతోంది. ఇది పైన చెప్పుకున్న సమస్యలను మరింతగా పెంచుతున్నది. మన భూమి వాతావరణాన్ని నియంత్రించడంలో సాగరం కీలక పాత్ర పోషిస్తుంది. భూమి వాతావరణంలో పేరుకుపోయిన వేడిలో 93 శాతం, శిలాజ ఇంధనాల నుండి విడుదలయ్యే కార్బన్ డయాక్సైడ్‌లో నాలుగింట ఒక వంతును అది గ్రహిస్తుంది. అయితే దీనివల్ల సాగర ఉష్ణోగ్రతలు 2100 నాటికి 1-4 డిగ్రీలు పెరుగుతాయని అంచనా. గత 30 సంవత్సరాలలో సాగర వేడిగాలులు 50 శాతం పైగా పెరిగాయి. ఈ మార్పులు సాగర ఆమ్లీకరణ, ఆక్సిజన్ స్థాయిలలో మార్పులు, సాగర ప్రవాహాల మార్పులకు దారితీస్తాయి. ఇవన్నీ సాగర జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ఆమ్లీకరణ...సాగర ఆవాసాలు, జాతుల నష్టానికి దారితీస్తాయి. మారుతున్న ప్రవాహాలు చేపల సంఖ్య పంపిణీని మారుస్తున్నాయి. మొత్తం పర్యావరణ వ్యవస్థల రూపురేఖలను మార్చేస్తున్నాయి. మన సాగరాలను నిలబెట్టుకోవాలంటే, మనం ఈ వాతావరణ ప్రేరిత మార్పులకు అనుగుణంగా మన చేపల వేట పద్ధతులను మార్చుకోవాలి.

సాగర జీవవైవిధ్యం ప్రాముఖ్యత

సాగరాల్లో అపారమైన జీవ వైవిధ్యం వుంటుంది. ప్రపంచంలోని 80 శాతం జాతులకు నిలయం సాగరాలే. ఇది కేవలం ఒక సంఖ్య కాదు. ఇది సాగర పర్యావరణ వ్యవస్థల స్థితిస్థాపకత, అనుకూలతకు ప్రాణం. విభిన్నమైన పర్యావరణ వ్యవస్థ పర్యావరణ మార్పులను తట్టుకోవడానికి సిద్ధంగా ఉంటుంది. తద్వారా కార్బన్ నిల్వ, నీటి శుభ్రత వంటి ముఖ్యమైన సహజ ప్రక్రియలు నిరంతరాయంగా పనిచేసేలా చూస్తుంది. కొన్ని జాతులకు సారూప్య పర్యావరణ పాత్రలు ఉండవచ్చు. ఒక జాతి క్షీణించినట్లయితే మరొకటి ఆ స్థానాన్ని భర్తీ చేయగలదు. అయితే, లార్జ్ టూత్ సాఫిష్ వంటి కొన్ని జాతులు ప్రత్యేకమైనవి. వాటిని కోల్పోవడమంటే లక్షలాది సంవత్సరాల పరిణామాన్ని కోల్పోవడమే.

కార్యాచరణ

వాస్తవం ఏమిటంటే, మనం సాగరం నుండి అది తిరిగి పునరుత్పత్తి చేయగలిగే దానికంటే ఎక్కువ తీసుకుంటున్నాం. 90 శాతం పెద్ద చేపల సంఖ్య తగ్గిపోయి, 50 శాతం పగడపు దిబ్బలు నాశనం కావడంతో, ఈ అసమతుల్యత స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ప్రపంచ సాగర దినోత్సవం, సాగరంతో మనకు ఉన్న లోతైన అనుబంధాన్ని శక్తివంతంగా గుర్తుచేస్తుంది.

ఇది వ్యక్తులు, సంఘాలు, ప్రభుత్వాల స్ఫూర్తితో కార్యాచరణకు ఒక పిలుపునిస్తుంది. మనం స్థిరమైన చేపల వేట పద్ధతులను అవలంబించాలి. అక్రమ చేపల వేటను అరికట్టాలి. వాతావరణ మార్పులను తగ్గించాలి. సంరక్షణ ప్రయత్నాలలో చురుకుగా పాల్గొనాలి. సాగరంతో ఒక కొత్త సమతుల్యతను సృష్టించడానికి కలిసి పని చేద్దాం. తద్వారా దాని సంపదను హరించకుండా...దాని జీవశక్తిని పునరుద్ధరించగలుగుతాం. అప్పుడే మనందరికీ ఆధారాన్నిచ్చే ఈ జీవరాశిని కాపాడుకోగలం.

- దుంగ జనక మోహన రావు, సెల్ : 8247045230

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

భారత్‌లోకి స్టార్‌లింక్‌ను అనుమతించొద్దు

- **అనుమతులను తక్షణమే రద్దు చేయాలి**
- **సిపిఎం డిమాండ్**

న్యూఢిల్లీ : భారత్‌లో తన కార్యకలాపాలను ప్రారంభించేందుకు ఎలాన్ మస్క్‌కి చెందిన స్టార్‌లింక్‌కు భారత ప్రభుత్వం అనుమతినివ్వడాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ మేరకు పొలిట్‌బ్యూరో ఒక ప్రకటన విడుదల చేసింది. మన దేశంలో కార్యకలాపాలు నిర్వహించేందుకు స్టార్‌లింక్‌కు అనుమతి లభించిన మొత్తం ప్రక్రియకు సంబంధించి ఎలాంటి పారదర్శకత లేదు. స్టార్‌లింక్ విదేశీ కార్పొరేషన్, భారత్‌కు చెందిన కీలకమైన మౌలిక సదుపాయాల వ్యవస్థను విదేశీ చేతులకు అప్పగించడంలో తీవ్రమైన భద్రతా పర్యవసానాలు ఇమిడివున్నాయి. మన టెలికం వ్యవస్థలోకి, చివరకు మన వ్యూహాత్మక కమ్యూనికేషన్లలోకి అమెరికా సంస్థలు ప్రవేశించడానికి దొడ్డిదారిని ఇది అందచేస్తోంది. శాటిలైట్ స్పాట్ నెంబర్లను ముఖ్యంగా లో ఎర్త్ ఆర్బిట్ (దిగువ భూ కక్ష్య) స్పాట్‌లను ఒకసారి స్టార్‌లింక్‌కు కేటాయిస్తే ఇక అవి మనం వెనక్కి తీసుకోలేం. మన దేశ ప్రయోజనాలను పణంగా పెట్టి అసలే అరకొరగా వున్న మన రోదసీ వనరులను విదేశీ సంస్థలకు కట్టబెట్టడమే ఇదని పొలిట్‌బ్యూరో తీవ్రంగా విమర్శించింది. మన దేశ స్వావలంబన సామర్ధ్యాలను అభివృద్ధిపరచడంలో ప్రభుత్వానికి నిజంగా ఆసక్తి వున్నట్లైతే, ఇస్రో సేవలను ఉపయోగించుకోవచ్చునని పేర్కొంది. భారత్, ముఖ్యంగా డిఓటి, సి-డిఓటిలు శాట్‌కామ్ రంగానికి అవసరమైన పరికరాలను అందచేయగల సామర్ధ్యాలను కలిగివున్నాయని పేర్కొంది. ఈ చర్యలు భారత ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేస్తాయని, మన భద్రతను, డిజిటల్ సార్వభౌమాధికారాన్ని పరిరక్షిస్తాయని పేర్కొంది.

మొత్తం ఒప్పందం ప్రక్రియ అంతా మిస్టరీగా వుంది. ట్రాయ్ కేవలం నాలుగు శాతమే స్పెక్ట్రమ్ యూసేజ్ చార్జీలు వసూలు చేస్తోంది. అంతకుమించి ఎలాంటి ముందస్తు రుసుములు వసూలు చేయదు. దీనివల్ల మన ఖజానాకు భారీగా నష్టాలు వస్తున్నాయి. మన ప్రయోజనాలకు విఘాతం కలుగుతోంది. భారత రోదసీ నియంత్రణ సంస్థ ఇన్-స్పేస్ నుండి కూడా వివరాలు, ఇతర పరిస్థితి గురించి ఎలాంటి సమాచారం వెల్లడి కాలేదని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

స్టార్‌లింక్ ప్రవేశం, అంబానీ రిలయన్స్ జియోతో, మిట్టల్ భారతి ఎయిర్‌టెల్‌తో దాని భాగస్వామ్యం కలిసి ఒక వర్చువల్ డ్యూపోలీ (సాంకేతికంగా చూసినట్లైతే రెండు కంపెనీలు స్వతంత్రమైనవే అయినప్పటికీ అవి ఒకదానితో మరొకటి పెనవేసుకుపోయి ఒకే సంస్థ నియంత్రణలో వుంటూ పనిచేసే మార్కెట్ పరిస్థితి)ని సృష్టించబోతున్నాయి. బిఎస్‌ఎన్‌ఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థకు దీంతో పోటీ పడడం చాలా కష్టం కాగలదు. దేశంలో దాదాపు అన్ని ప్రాంతాలకు చౌకగా టెలికం, ఇంటర్‌నెట్ సేవలను అందిస్తున్న బిఎస్‌ఎన్‌ఎల్‌ను పూర్తిగా నాశనం చేయడానికి ప్రభుత్వం తీసుకుంటున్న మరో ప్రయత్నంగా ఇది కనిపిస్తోంది. స్టార్‌లింక్ కార్యకలాపాలను అనుమతించడం వల్ల దీర్ఘకాలంలో దేశ ప్రయోజనాలకు హానికరమవుతుంది. అందువల్ల తక్షణమే ఈ నిర్ణయాన్ని రద్దు చేసుకోవాలని ప్రభుత్వాన్ని సిపిఎం డిమాండ్ చేస్తోంది.

లోపాలున్నా న్యాయవ్యవస్థ ప్రతిపత్తికి రక్షణ

- **కొలీజియం వ్యవస్థపై జస్టిస్ సూర్యకాంత్**



న్యూఢిల్లీ : జ్యుడీషియల్ నియామకాలు జరిపే కొలీజియం వ్యవస్థ న్యాయవ్యవస్థ స్వయం ప్రతిపత్తిని పరిరక్షిస్తోందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. లోపాలు, లొసుగులు వున్నా ఇది కీలకమైన సంస్థాగత రక్షణగా పనిచేస్తోందని చెప్పారు. శనివారం సియాటెల్ యూనివర్శిటీలో "నిశ్శబ్ద కాపలాదారుడు : కోర్టులు, ప్రజాస్వామ్యం, సరిహద్దుల మధ్య చర్చలు" అన్న అంశంపై సూర్యకాంత్ ప్రసంగించారు. ప్రభుత్వం, చట్టసభల జోక్యాన్ని కొలీజియం వ్యవస్థ గణనీయంగా పరిమితం చేస్తోందని, తద్వారా న్యాయ వ్యవస్థ స్వయంప్రతిపత్తిని కాపాడుతోందని అన్నారు. న్యాయమూర్తుల నిష్పాక్షికతను దెబ్బతీసేలా బాహ్య ఒత్తిళ్లు వారిపై పనిచేయకుండా రక్షణనిస్తోందని పేర్కొన్నారు. ఇటీవల సుప్రీం కోర్టు చేస్తున్న ప్రయత్నాలు, పారదర్శకతను పెంచడానికి, ప్రజల విశ్వాసం చూరగొనడానికి నిబద్ధతను సూచిస్తున్నాయని అన్నారు. కొన్నిసార్లు న్యాయపరమైన క్రియాశీలతకు, న్యాయపరమైన అతిక్రమణకు మధ్య గల సన్నని రేఖను ఉల్లంఘిస్తోందనే విమర్శలకు జ్యుడీషియరీ ఏమీ అతీతంగా లేదని ఆయన అంగీకరించారు. రాజ్యాంగపరమైన నైతికతకు కాపలాదారుగా న్యాయవ్యవస్థ వుందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య నైతికతను రూపుదిద్దడంలో ఒకసాధనంగా పనిచేస్తోందన్నారు.

ప్రజాస్వామ్యంలో న్యాయస్థానాల పాత్రపై మాట్లాడుతూ, "రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యంలో, మెజారిటీలు తనిఖీ చేయబడే, మైనారిటీలకు రక్షణ కల్పించే వ్యవస్థ వుంటుంది. ప్రజాదరణ పేరుతో సిద్ధాంతాలు, సూత్రాలను త్యాగం చేయలేం. అటువంటి వ్యవస్థలో కోర్టులు కేవలం రిఫరీలుగా పనిచేయలేవు" అని వ్యాఖ్యానించారు. భారతదేశంవంటి విస్తారమైన, వైవిధ్యభరితమైన ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థ తన అధికారాలను పెద్దగా ఉపయోగించుకోకుండా, స్పష్టమైన మనస్సాక్షిని కలిగివున్నపుడు మాత్రమే మన సమిష్టి ప్రజాస్వామ్య పయనంలో అనేకమంది విశ్వసనీయ స్వరంగా వినిపిస్తుందని జస్టిస్ సూర్యకాంత్ నొక్కి చెప్పారు.

ఉగ్రవాదాన్ని ఉపేక్షించేది లేదు!

- **భాగస్వాములు అర్థం చేసుకోవాలన్న జైశంకర్**
- **బ్రిటన్ విదేశాంగ కార్యదర్శితో భేటీ**



డేవిడ్ లామీతో మాట్లాడుతున్న జై శంకర్

న్యూఢిల్లీ : ఉగ్రవాదాన్ని ఏమాత్రమూ ఉపేక్షించేది లేదని, తమ భాగస్వాములు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని భారత్ ఆశిస్తోందని విదేశాంగ మంత్రి జై శంకర్ అన్నారు. ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తున్న బ్రిటీష్ విదేశాంగ కార్యదర్శి డేవిడ్ లామీతో శనివారం భేటీ సందర్భంగా జై శంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్, పాక్‌లను ఒకే గాటన కట్టవద్దని ఆయన కోరారు. అయినా ఉగ్రవాదానికి పాల్పడేవారిని, బాధితులను ఒకే రీతిగా ఎలా చూస్తారని ఆయన ప్రశ్నించారు. పహల్గాం ఉగ్ర దాడిని ఖండించినందుకు, ఉగ్రవాదంపై పోరాటంలో భారత్‌కు మద్దతు ప్రకటించినందుకు ఆయన బ్రిటన్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. భారత్, పాక్‌ల మధ్య శాశ్వత కాల్పుల విరమణకు, చర్చలు, విశ్వాస పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు అమెరికా, బ్రిటన్ కృషి చేస్తున్నాయని ఈ నెల 17న పాక్‌లో పర్యటన సందర్భంగా లామీ చెప్పారు. ఆ ప్రకటనను ఆనాడే భారత్ తీవ్రంగా ఖండించింది. భారత్, పాక్ మధ్య మూడో పక్షం జోక్యం వుండదని స్పష్టం చేసింది. భారత్-బ్రిటన్‌ల మధ్య కుదిరిన ఎఫ్‌టిఎను జై శంకర్ ప్రస్తావిస్తూ, ఇరు దేశాల సంబంధాల్లో ఇదొక మైలురాయి అని వ్యాఖ్యానించారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేయడమనేది మా ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చుకునే దిశగా ప్రారంభం మాత్రమేనని లామీ వ్యాఖ్యానించారు. ఈ సరికొత్త అంతర్జాతీయ శకంలో భారత్‌తో ఆధునిక భాగస్వామ్యాన్ని నిర్మించుకుంటున్నామని చెప్పారు. భారత్‌కు బయలుదేరడానికి ముందుగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అభివృద్ధి, సాంకేతికత, వాతావరణ సంక్షోభ పరిష్కారం, భద్రతా పరమైన అంశాల్లో పరస్పరం సహకారం పెంచుకోవాలని ఆశిస్తున్నట్లు తెలిపారు.



నిరసనకారులపై లాఠీఛార్జ్ చేస్తున్న పోలీసులు

లాస్ ఏంజెల్స్‌లో నిరసనల హోరు

- **ఆకస్మిక ఇమ్మిగ్రేషన్ దాడులపై ఆందోళన**
- **అణచివేత చర్యలతో అడ్డుకున్న పోలీసులు**

లాస్ ఏంజెల్స్ : అమెరికాలోని లాస్ ఏంజెల్స్ నగరంలో అధికారులు జరిపిన ఆకస్మిక ఇమ్మిగ్రేషన్ దాడులు నిరసనలకు దారితీశాయి. ఆందోళనకారులను అడ్డుకునేందుకు పోలీసులు భాష్పవాయు గోళాలు, పెప్పర్ స్ప్రే, ఫ్లాష్ బ్యాంగ్ గ్రెనేడ్లను ప్రయోగించారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వలసదారులపై ఉక్కుపాదం మోపుతుండడంతో ఆగ్రహ జ్వాలలు మిన్నంటుతున్నాయి. అనేక మంది నిరసనకారులను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రభుత్వ ఏజెంట్లు కొందరు శుక్రవారం మధ్యాహ్నం ఓ హోల్‌సేల్ బట్టల దుకాణంలో ప్రవేశించి అనేక మంది ఉద్యోగులను నిర్బంధించారు. దీంతో అక్కడికి చేరుకున్న ప్రజలు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు.

అక్కడి నుంచి వెళ్లిపోవాల్సిందిగా ప్రభుత్వ ఏజెంట్లు హెచ్చరించడంతో ఆందోళనకారుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. నిరసన తెలుపుతున్న వారిని చెదరగొట్టేందుకు పోలీసులు ఫ్లాష్ బ్యాంగ్ గ్రెనేడ్లు విసిరారు. నిర్బంధించిన వలసదారులను వ్యాన్లలో కుక్కి అక్కడి నుంచి తరలించారు. సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో వందలాది మంది ప్రదర్శనకారులు లాస్ ఏంజెల్స్ ఫెడరల్ భవనం వద్దకు చేరుకున్నారు. దాడులు ఆపాలని, సర్వీస్ ఎంప్లాయీస్ ఇంటర్నేషనల్ యూనియన్‌కు చెందిన కాలిఫోర్నియా యూనిట్ అధ్యక్షుడు డేవిడ్ హర్తాను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దాడులను చిత్రీకరిస్తున్న కార్మిక నేత హర్తాపై పోలీసులు జులుం ప్రదర్శించడంతో ఆయన గాయపడ్డారు. అనంతరం ఆయనను అరెస్ట్ చేశారు.

రాత్రి సమయంలో పోలీసులు రెచ్చిపోయి నిరసనలను అణచివేసేందుకు సిద్ధపడ్డారు. కొందరు నిరసనకారులు పోలీసులపై రాళ్లు రువ్వారు. దీంతో ప్రజలు గుమిగూడడాన్ని చట్టవిరుద్ధంగా అధికారులు ప్రకటించారు. అక్కడ నుంచి వెళ్లకపోతే అరెస్టులు తప్పవని హెచ్చరించారు. కాగా లాస్ ఏంజెల్స్‌లోని మూడు ప్రదేశాలలో నాలుగు తనిఖీలు నిర్వహించామని అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) ప్రతినిధి యస్మీన్ పిట్స్ ఓ కీఫ్ తెలిపారు. మొత్తంగా 44 మందిని అరెస్ట్ చేశామని చెప్పారు. అక్రమ వలసదారులను దేశం నుంచి బహిష్కరించాలన్న ట్రంప్ నిర్ణయానికి అనుగుణంగా లాస్ ఏంజెల్స్‌లో అధికారులు తనిఖీలు జరుపుతున్నారు.

ఆగస్టు 17న బొలీవియా అధ్యక్ష ఎన్నికలు

- **ఎవో మొరేల్స్ పై అనర్హత వేటు**

లా పాజ్ ; బొలీవియా అధ్యక్ష ఎన్నికలను ఆగస్టు 17న నిర్వహిస్తామని సుప్రీం ఎలక్టోరల్ ట్రిబ్యునల్ (టిఎస్ఇ) ప్రకటించింది. ఈ మేరకు అభ్యర్థుల జాబితాను శుక్రవారం మీడియా సమావేశంలో అధికారికంగా వెల్లడించింది. వివిధ రాజకీయ పార్టీలు, కూటముల నుండి మొత్తంగా 10 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. బొలీవియా మాజీ అధ్యక్షుడు ఎవో మొరేల్స్ పార్టీ (బొలీవియన్ నేషనల్ యాక్షన్) చట్టపరమైన హోదా కోల్పోయినందున ఆయనను పోటీకి అనర్హుడిగా ప్రకటించింది. మే 19వ తేదీతో రిజిస్ట్రేషన్ వ్యవధి ముగిసింది. మాజీ అధ్యక్షుడు కార్లోస్ ఎడ్వర్డో డెల్ కాస్టిల్లో (సోషలిస్ట్ ఉద్యమ పార్టీ) పోటీలో ఉన్నారు.

మరోవైపు ఎవో మొరేల్స్‌ను పోటీకి అనుమతించాలని డిమాండ్ చేస్తూ ఆయన మద్దతుదారులు నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. బొలీవియా ప్రజాస్వామ్యానికి ఆయన నాయకత్వం చాలా ముఖ్యమైందని వారు నినదిస్తున్నారు. సోషలిస్ట్ ఉద్యమ పార్టీతో విడిపోయిన తర్వాత మొరేల్స్ తన పార్టీ తరపున పోటీ చేయడానికీ సిద్ధపడ్డారు. బొలీవియా ఎన్నికలు ప్రజల్లో ఉత్కంఠ రేపుతున్నాయి. ఎవో మోరల్స్ వంటి కీలక వ్యక్తిపై అనర్హత వేటు వేయడం వల్ల ఘర్షణలు తీవ్రమై, సామాజిక అశాంతి చెలరేగే అవకాశం లేకపోలేదని పరిశీలకులు భావిస్తున్నారు. రాజకీయ సమీకరణలు వేగంగా మారిపోతున్న నేపథ్యంలో ఈ ఎన్నికలు జరగనున్నాయి. అనేక క్లిష్ట పరిస్థితుల మధ్య బొలీవియా ప్రజలు తమ అధ్యక్షుడ్ని, ఉపాధ్యక్షుడిని ఎన్నుకోనున్నారు.

మహారాష్ట్ర ఎన్నికల పై ఆరోపణలు అసంబద్ధమైనవి : ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో "మ్యాచ్ ఫిక్సింగ్" జరిగిందని కాంగ్రెస్ నాయకుడు, లోక్‌సభ ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన విమర్శలను భారత ఎన్నికల సంఘం ఖండించింది. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రజలు తమకు అనుకూలంగా ఓట్లు వేయలేదని ఎన్నికల కమిషన్‌ను నిందించడం సరికాదని, మహారాష్ట్ర ఓటర్ల జాబితాపై లేవనెత్తిన ఆరోపణలకు ఆధారాలు లేవని, ఇది చట్టాన్ని అవమానించడమేనని ఇసి పేర్కొంది. తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తే అది రాజకీయ పార్టీల కార్యకర్తలకు, ప్రతినిధులకు చెడ్డపేరు తెస్తుందని, ఇంత భారీ ఎన్నికల ప్రకియ కోసం అవిశ్రాంతంగా పనిచేసిన లక్షలాది మంది ఎన్నికల సిబ్బందిని నిరుత్సాహపరుస్తుందని తెలిపింది.

ప్రజా రాజధానిగా అమరావతి

(మొదటిపేజీ తరువాయి)

చూస్తోందన్నారు. 35 ఏళ్లలో మూడు దశల్లో రాజధాని నిర్మాణం పూర్తి చేస్తామని ఒప్పందంలో పేర్కొంటూ ప్రజలకేమో మూడేళ్లలో రాజధాని పూర్తవుతుందని పాలకులు అబద్ధాలు చెబుతున్నారన్నారు. రాజ్యసభ మాజీ సభ్యులు పి మధు మాట్లాడుతూ.. ప్రజా రాజధాని అని చెప్పే చంద్రబాబు ప్రభుత్వం రాజధానిలో భూములిచ్చిన రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎందుకు ఎత్తి వేయలేదని ఆయన ప్రశ్నించారు. రాజధానిని గేటెడ్ కమ్యూనిటీగా మారుస్తున్న ప్రభుత్వం తమ విధానాలను మార్చుకోవాలని సూచించారు. అన్ని వర్గాలు నివశించేందుకు వీలుగా ప్రజా రాజధానిని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. భూములన్ని కార్పొరేట్లకు కేటాయిస్తూ పోతే రాజధానిలో పౌర హక్కులకు స్థానం ఉండదన్నారు. రాజధాని నిర్మాణానికి బిజెపి ప్రభుత్వం కేవలం రూ.1500 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, హడ్కోల ద్వారా రుణాలిప్పించి కేంద్రం రాజధాని నిర్మాణ బాధ్యత నుంచి తప్పుకుందని విమర్శించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబురావు మాట్లాడుతూ.. మరో 40 వేల ఎకరాలు ఇవ్వకుంటే భూ సేకరణ కింద తీసుకుంటామని, రైతులు నష్టపోతారంటూ ప్రభుత్వం వారిని బెదిరిస్తోందన్నారు. రాజధానిలో ప్రైవేట్ యూనివర్సిటీలకు తక్కువ ధరకు భూములు కేటాయిస్తున్న ప్రభుత్వం రాజధాని నిర్మాణం కోసం భూములిచ్చిన రైతుల కుటుంబాల్లోని విద్యార్థులకు తక్కువ ఫీజుకు ఎందుకు సీట్లు కేటాయించడం లేదని ప్రశ్నించారు. పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. రాజధాని అంటూ భూములు, రియల్ ఎస్టేట్ అనే విధానంలోకి ప్రభుత్వం ప్రజలను తీసుకెళ్లిందన్నారు. అమరావతిని కార్పొరేట్ రాజధానిగా మార్చాలనే ఆలోచనను విరమించుకోవాలని, ప్రజాపాలన కోసం ప్రజా రాజధానిగా అమరావతిని తయారు చేయాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) యూనివర్సిటీని ప్రభుత్వం ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు. న్యూ డెమొక్రసీ నాయకులు కె పోలారి మాట్లాడుతూ.. కార్పొరేట్లకు రైతుల భూములను కట్టబెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందే తప్ప రైతులకు మాత్రం న్యాయం చేయడం లేదన్నారు. ఈ సమావేశంలో పలువురు వక్తలు ప్రసంగించారు.



అదే ఆనందం




చందమామను
తాకిన గాని
తృప్తి తీరలేదు
నీ పయనమాగలేదు.
ఆకాశంలో ఇల్లు
కట్టినా
ఆశ తీరలేదు
నీ ధ్యాస మారలేదు.
సూర్య గ్రహాన్ని
చుట్టూ వచ్చినా
అంగారకుని
తట్టి వచ్చినా
హరివిల్లె
నీ చేతి కందినా
మేఘాలన్నీ
ముద్దులాడినా

కృత్రిమ మేధకు
సొగసులు దిద్ది
ఊహించని
తళుకులెన్నో అద్ది
ఎటు వెడుతున్నావో
తెలుసుకో
పొరబాటే రాకుండ
చూసుకో .
వినాశకాలే
విపరీత బుద్ధనే
పలుకు బడినే
నిజమే చేస్తావో
విచక్షణ కలిగి

విజ్ఞత నెరిగి
మానవాళికి
మంచి చేసేదవో
ఆవిష్కరణల
అద్భుత ఫలితం
విశ్వమానవ
సౌభ్రాతృత్వం.
జరిగినప్పుడే
జన్మలు ధన్యం
పుడమి తల్లికి
అదే ఆనందం .

- కూచిమంచి నాగేంద్ర
91821 27880


ఖాళీలు పూరించండి



పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు, వాటి పక్కనే వాటి పేర్లూ ఉన్నాయి. అయితే, స్పెల్లింగ్‌లో కొన్ని అక్షరాలు లేవు. వాటిని నింపండి.



నేను గీసిన బొమ్మ





కె.జాయ్ క్రిసోలిన్,
9వ తరగతి,
సెయింట్ జోసెఫ్స్
ఇంగ్లీష్ స్కూల్,
కర్నూలు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

యుద్ధం కమ్మిన నేలలో భద్రత కోల్పోయిన బాలలు ..!



ప్రకృతి వైపరీత్యాలకు, మానవ తప్పిదాలకు ముందుగా బలయ్యేది చిన్నారులు. తమ చుట్టూ ఏం జరుగుతుందో వారికి తెలియదు. దాని పర్యవసానాలు తమపై ఎంత తీవ్ర ప్రభావం చూపుతాయో వారికి అర్థం కాదు. అయినా ఆ విపరీతాలకు వారే కేంద్రబిందువవుతారు. గడిచిన ఐదేళ్లలో ప్రపంచంలో వివిధ దేశాల్లో నెలకొన్న యుద్ధ పరిస్థితులకు బాల ప్రపంచం చిగురుటాకులా వణికిపోతోంది. గాజా, ఉక్రెయిన్, సూడన్, మయన్మార్‌లో తలెత్తిన భీకరదాడులకు పిల్లలకు జరిగిన నష్టం అంతా ఇంతా కాదు. వారు ఉద్దేశపూర్వకంగా లక్ష్యం అయ్యారు. ఓ ప్రణాళిక ద్వారా స్థానభ్రంశం చెందారు. వ్యూహాలు వేసి మరీ వారిని ఆకలితో అలమటింపజేస్తున్నారు.

'ఈ సంఘర్షణలు పిల్లలకు సాధారణం కాకూడదు. 2024 ఏడాది చిన్నారుల పాలిటి చెత్త సంవత్సరం' అని యునిసెఫ్ పిల్లల నిధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేథరీన్ రస్సెల్ ప్రపంచాన్ని హెచ్చరించడం బట్టే పరిస్థితి తీవ్రత అర్థమవుతోంది.

పిల్లల సంరక్షణపై ఐక్యరాజ్యసమితి పర్యవేక్షణ ప్రారంభమైనప్పటి నుండి నమోదైన గణాంకాల్లో కెల్లా ఈ రెండేళ్లల్లో నమోదైన గణాంకాలు కలవరపాటుకు గురిచేస్తున్నాయి. 2023లో 22,500 మంది పిల్లలపై 32,990 తీవ్ర ఉల్లంఘనలు నమోదయ్యాయి. ఈ ఏడాది ఐదు నెలల్లోనే ఆ సంఖ్య అధిగమించేందుకు సిద్ధంగా ఉంది.

గాజా : 2023 అక్టోబరు నెల నుండి ప్రారంభమైన ఇజ్రాయిల్ దాడుల్లో గాజా 'వేలాది మంది పిల్లలకు శ్మశానవాటికగా తయారైంది. బతికున్న పిల్లలకు ప్రత్యక్ష నరకంగా మారింది' అని జెనీవాలో యునిసెఫ్ ప్రతినిధి జేమ్స్ ఎల్డర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐక్యరాజ్య సమితి నివేదిక ప్రకారం గాజాలో మరణించిన వారిలో పిల్లలే అధిక సంఖ్యలో ఉన్నారు. ఇంకా లెక్కించని వేలాదిమంది శిథిలాల కింద చిక్కుకున్నారు. దాడులకు సుమారు 19 లక్షల మంది స్థానభ్రంశం చెందితే – వారిలో సగానికి పైగా పిల్లలు ఉన్నారు. శరణార్థ శిబిరాలు కూడా వారికి రక్షణ ఇవ్వడం లేదు. స్కూళ్లు, హాస్పటల్స్ కూడా బాంబు దాడుల్లో కుప్పకూలుతున్నాయి. ఈ ఏడాది జనవరి నాటికి నిరాశ్రయులు తలదాచుకుంటున్న 370 స్కూళ్ల నేలమట్టమయ్యాయి. యుఎన్ నివేదిక ప్రకారం అక్కడ నీటి లభ్యత 5 శాతానికి పడిపోయింది. ఫలితంగా డీహైడ్రేషన్‌తో పసికందులు కన్నుమూస్తున్నారు. ఆకలితో మరణిస్తున్న పిల్లల సంఖ్య కూడా ఎక్కువే. యుద్ధ వాతావరణం పిల్లల మానసిక ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. వైకల్యం బారిన పడిన వారి సంఖ్య కూడా అధికం. గాజాలో పిల్లల పరిస్థితిని ఒక్క మాటలో చెప్పాలంటే 'అక్కడ బాల్యం అనే భావనే విచ్ఛిన్నమైంది. పిల్లల మనుగడ పాఠశాల విద్యని భర్తీ చేసింది. దు:ఖం వారి రోజువారీ చర్యగా మారింది'.

ఉక్రెయిన్ : 2022 ఫిబ్రవరి నుండి ఉక్రెయిన్ దేశంలో బాంబు దాడులు జరుగుతున్నాయి. 2,500 మందికి పైగా మరణించారు. వెయ్యిరోజులకు పైగా జరుగుతున్న ఈ దాడుల్లో పిల్లల భవిష్యత్తు అంధకారమైంది. నిద్రపోతున్న పిల్లలు కూడా సురక్షితంగా లేరు. వారి తలలపై నుండి మిసైళ్ల దూసుకుపోతున్నాయి. ప్రతి ఐదుగురిలో ఒక చిన్నారి తమ బంధువునో, స్నేహితున్నో కోల్పోతున్నారు. దాడి తీవ్ర స్థాయిలో ఉన్న 2022లో 4 లక్షల కంటే ఎక్కువ మంది పిల్లలు స్థానభ్రంశం చెందారు. 6 లక్షలకు పైగా విదేశాల్లో శరణార్థులుగా ఉంటే వారిలో పిల్లలే అధికం. పేదరికం పెరిగిపోయి, మూడింట రెండొంతుల మంది దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారు. 1600 స్కూళ్లు, 790 ఆరోగ్య కేంద్రాలు శిథిలమయ్యాయి. తరగతి గదులు బంకర్లకి ఆవాసాలుగా మారాయి. ఆన్‌లైన్ విద్య అగమ్యగోచరంగా ఉంది. పిల్లల జనాభాలో అత్యధిక మంది అభ్యసన సామర్థ్యాన్ని కోల్పోయారు. 'నా తరగతి గది డెస్క్‌లో నేను ఎప్పటికీ కూర్చోలేను. ఎందుకంటే బాంబు దాడిలో మా స్కూలు భవనం నేలమట్టమైంది' అని 15 ఏళ్ల డేవిడ్ అంటున్న మాటలను యున్ నివేదిక రికార్డు చేసింది.


మరణం, విధ్వంసం మధ్య పిల్లలు దీర్ఘకాలం జీవిస్తే, వారి భవిష్యత్తు భయం గుప్పెట్లో మగ్గిపోతుందని యుఎన్ హెచ్చరించింది.

సూడాన్ : ఏప్రిల్ 2023 నుండి సూడాన్‌లో సంఘర్షణ మొదలైంది. 4 లక్షల మంది చిన్నారులు స్థానభ్రంశం చెందారు. 2 లక్షలకు పైగా నిరాశ్రయులయ్యారు. లక్షమంది చిన్నారులు చాడ్, ఈజిప్ట్, దక్షిణ సూడాన్‌కి తరలిపోయారు. ఘర్షణలు మొదలైన మొదటి 11 రోజుల వ్యవధిలోనే 190 మంది పిల్లలు మృత్యువాత పడ్డారు. 1700 మందికి పైగా గాయపడ్డారు. ఏడాది ముగిసే నాటికి సుమారు 500 మంది మరణిస్తే, 700కి పైగా వికలాంగులయ్యారు. లెక్కకు రాని మరణాలు కూడా ఎక్కువే. స్కూళ్లు, హాస్పిటళ్లు శరణార్థ శిబిరాలుగా మారడమో, లేక నేలమట్టమవ్వడమో సాధారణంగా జరిగిపోతోంది. దీంతో పారిశుధ్యం లోపించి కలరా, మలేరియా, డయేరియా వ్యాధులు ప్రబలుతున్నాయి. శిబిరాల్లో ఉన్న చిన్నారులు డీహైడ్రేషన్ వల్ల కూడా చనిపోతున్నారు. సూడాన్‌లో ఆకలి సంక్షోభం తలెత్తి పిల్లలు పోషకాహార లేమికి గురవుతున్నారు. 7 లక్షల 30 వేల మందికి పైగా మరణం చివరి అంచులకు చేరుకున్నారు. ఈ సంక్షోభంతో అక్కడ మానవత్వం మసకబారింది. ఆహారం లూటీ అవుతోంది. 'పౌరులకు అందవలసిన ఆహార సదుపాయాలను కూడా నిలిపివేసి, వారి మరణానికి కారకలౌతున్నార'ని యుఎన్ రిలీఫ్ చీఫ్ మార్టిన్ గ్రిఫ్ఫిత్స్ విచారం వ్యక్తం చేశారు.

సూడాన్‌లో యుద్ధం వల్ల విద్య పూర్తిగా నిలిచిపోయింది. 10,400కి పైగా స్కూళ్లు మూతబడ్డాయి. సుమారు 2 కోట్ల మంది చిన్నారులు విద్యకు దూరమయ్యారు. అంతంతమాత్రం ఉన్న విద్యావ్యవస్థ ఇప్పుడు మరింత దిగజారింది. ప్రపంచ విద్యా సంక్షోభానికి దారి తీసే ప్రమాదముంది.

మయన్మార్ : ఇక్కడ యుద్ధం పైకి కనిపించదు. కానీ 2021 సైనిక తిరుగుబాటు నుండి ఇప్పటివరకు మూడు లక్షలకు పైగా జనాభా అంతర్గత నిరాశ్రయులయ్యారు. వారిలో 40 శాతం మంది పిల్లలే ఉన్నారు. తిరుగుబాటు ప్రారంభమైన నాటి నుండి 460 మంది పిల్లలు చనిపోయారు. ఆ సంఖ్య 2024 నాటికి రెట్టింపైంది. ఆ ఏడాది 750 మంది చిన్నారులు మరణించారు. ఈ దేశం ప్రపంచంలోనే పిల్లలకు అత్యంత కలుషితమైన దేశంగా పరిగణించబడుతోంది. దేశంలో 55 శాతం మంది పిల్లలు పేదరికానికి నెట్టివేయబడ్డారు. పది లక్షల మంది పిల్లలకు ప్రాథమిక రోగనిరోధక శక్తి లోపించింది. టీకాలు అందడం లేదు. 2024లో వచ్చిన మోచా తుపాను ప్రభావానికి 3 లక్షల మందికి పైగా పిల్లలు ప్రభావితమయ్యారు. ఇక్కడి పిల్లలు హింస, ప్రకృతి విపత్తులను ఎదుర్కొంటున్నారు. కొంతమంది పిల్లలు పాఠశాలకు వెళ్లడానికి భయపడుతుంటే, మరికొంతమంది వెళ్లేందుకు అక్కడ పాఠశాలలు నడవడం లేదు. ఇక్కడ యుద్ధం కనిపించడం లేదు. కానీ నిరంతర సంఘర్షణ, హింస, దాడులు, విపత్తుల ప్రభావం అంతకంటే తక్కువ కాదు. ఈ మొత్తం ప్రభావాలు నాలుగు దేశాల్లో ఒకేలా ఉన్నాయి. 2025 నాటికి ఈ ప్రభావం మరింత పెరిగింది. ఇక్కడ వెలుగుచూస్తున్న ప్రతి చిన్నారి వ్యధ చెదిరిపోయిన బాల్యానికి గుర్తు. పిల్లలకు విద్య, భద్రత, భావోద్వేగ స్వస్థతతో కూడిన భవిష్యత్తు చాలా అవసరం. ప్రపంచమంతా ఏకమై పిల్లలను, వారి భవిష్యత్తుని కాపాడుకోవాల్సిన తరుణమిది.

'ఎఎ 22' హీరోయిన్ దీపిక



అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ భారీ ప్రాజెక్ట్ తెరకెక్కుతోందన్న సంగతి తెలిసిందే. సన్ పిక్చర్స్ నిర్మాణసంస్థపై భారీ బడ్జెట్‌తో ఈ చిత్రం నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. తాజాగా ఈ చిత్రంలో నటిస్తున్న హీరోయిన్ పేరును చిత్రబృందం ప్రకటించింది. ఈ సినిమాలో బాలీవుడ్ నటి దీపికా పదుకొణె నటిస్తున్నారు. ఈ మేరకు చిత్రబృందం స్పెషల్ వీడియో షేర్ చేసింది. అల్లు అర్జున్ 22వ ప్రాజెక్ట్‌గా ఇది ప్రచారంలో ఉంది. సమాంతర ప్రపంచం, పునర్జన్మల కాన్సెప్ట్‌తో ముడిపడి ఉండే సైన్స్‌ఫిక్షన్ సినిమాగా దీన్ని తెరకెక్కిస్తున్నారు. దీనికోసం చిత్రబృందం ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టించే పనిలో ఉంది. హాలీవుడ్‌కు చెందిన ఓ ప్రముఖ వీఎఫ్ఎక్స్ సంస్థ ఈ సినిమా కోసం రంగంలోకి దిగింది. అంతర్జాతీయ ప్రమాణాలతో భారీ బడ్జెట్‌తో నిర్మితం కానున్న ఈ సినిమా ఈయేడాది ద్వితీయార్థంలోనే చిత్రీకరణ ప్రారంభించుకోనుందని సమాచారం.

ఇండస్ట్రీలోకి మరో కమిటీ



తెలుగు చలన చిత్ర పరిశ్రమలో ఇటీవల పలు పరిణామాలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే టాలీవుడ్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఓ ప్రత్యేక కమిటీ ఏర్పాటు అయింది. నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్ల సెక్టార్ల నుంచి 30 మంది సభ్యులతో ఈ కమిటీ ఏర్పడింది. ఈ ప్రత్యేక కమిటీకి చైర్మన్‌గా తెలుగు ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు భరత్ భూషణ్ వ్యవహరించనున్నారు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ దామోదర ప్రసాద్ కన్వీనర్‌గా ఉండనున్నారు. నిర్మాతల విభాగం తరఫున దామోదర ప్రసాద్, దిల్ రాజు, ప్రసన్నకుమార్, సి.కల్యాణ్, రవికిషోర్, రవి శంకర్, నాగవంశీ, దానయ్య, స్వప్నదత్, సుప్రియ ఇందులో సభ్యులుగా ఉన్నారు. మే 30వ తేదీన తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం విశాఖ వేదికగా జరిగింది. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ కమిటీ తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న ప్రస్తుత సమస్యలను పరిష్కరించడానికి మూడు రంగాల (నిర్మాతలు, పంపిణీదారులు, ఎగ్జిబిటర్స్) నుంచి ప్రాతినిధ్యం వహించే 30 మంది సభ్యులతో కూడిన అంతర్గత కమిటీని నియమించాలని నిర్ణయించింది. ఈ మేరకు తాజాగా ఆ కమిటీ వివరాలను వెల్లడించింది.

ఎపిఎఫ్‌డిసి చైర్మన్‌గా ఎంఎం రత్నం?



ఆంధ్రప్రదేశ్ సిని మా పరిశ్రమ అభివృద్ధి సంస్థ (ఎపిఎఫ్‌డిసి) నూతన చైర్మన్‌గా టాలీవుడ్ అగ్ర దర్శక, నిర్మాత ఎఎం రత్నం నియమించనున్నట్టు సమా చారం. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సిఫార్సు మేరకు సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ప్రతిపాదనతో ఈ నియామకం జరగనుంది. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లయ్యింది. హైదరాబాద్‌లో ఉన్న సినీ పరిశ్రమను కొంతమేరకైనా ఆంధ్రాకు రప్పించాలనే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. సినిమా రంగంపై అనుభవం ఉండి, ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి సమస్యలను పరిష్కరించగలిగే సత్తా ఉన్న నేతను ఈ పదవిలో నియమించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. దర్శక, నిర్మాతనే కాకుండా సినీ రంగంలోని అన్ని 24 క్రాఫ్ట్‌లపై ఎఎం రత్నానికి అవగాహన ఉందని చెబుతారు. సినీ రచయితగా కూడా మంచి పాటలను ప్రేక్షకులకు అందించారు. సాంకేతిక అభివృద్ధి కాని సమయంలో కూడా సరికొత్త టెక్నాలజీని తీసుకొచ్చి ప్రవేశపెట్టారు. ఒకే ఒక్కడు, భారతీయుడు వంటి బ్లాక్‌బస్టర్ సినిమాల్లో ఈ తరహా ప్రయోగాలు చూడొచ్చు. ఈ పోస్టు కోసం పలువురు ఆశావహులు ఉన్నప్పటికీ ఎఎం రత్నంకే అవకాశాలు ఉన్నట్లుగా పరిశీలకులు భావిస్తున్నారు. ఎఎంరత్నం స్వగ్రామం నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డి పాలెం.

సోషల్ మెసేజ్‌తో...

గీతా సింగ్, కార్తీక్, కాశీ మదన్, ఇషాని, చలానా అగ్నిహోత్రి, శృతి లయ నటీ నటులుగా యస్.యం. 4 ఫిలిమ్స్ బ్యానర్ పై యం.యస్. వి సాగర్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న సినిమా 'బ్యాచిలర్స్ ప్రేమ కథలు'. తాజాగా ఈ సినిమా ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శక నిర్మాత సాగర్ సినిమా విశేషాలు మాట్లాడారు. 'ఈ సినిమా ద్వారా ప్రేక్షకులకు మంచి సోషల్ మెసేజ్ ఇవ్వబోతున్నాను. అలాగే ఇందులో నూతన నటీనటులను ఇండస్ట్రీకి పరిచయం చేస్తున్నాను. ఈ నెలలో షూటింగ్ స్టార్ట్ చేసుకుంటున్న ఈ సినిమాను త్వరలోనే పూర్తి చేసి ఈ ఏడాదిలోనే విడుదల చేస్తామ'ని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గీతా సింగ్ మాట్లాడుతూ.. 'ఈ సినిమాలో నేను ఎమోషనల్ పాత్ర చేయబోతున్నాను. ఈ సినిమా ద్వారా సెకండ్ ఇన్నింగ్ స్టార్ట్ చేస్తున్నా. ఈ అవకాశం కల్పించిన సాగర్ గారికి నా ధన్యవాదాలు' అన్నారు.



ఫ్రెంచ్ ఓపెన్ విజేత గాఫ్

- ఫైనల్లో టాప్‌సీడ్ సబలెంకకు ఝలక్
- నేడు పురుషుల సింగిల్స్ తుది పోరు





ఫైనల్లో ఓటమితో కన్నీరుపెడుతున్న సబలెంక

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ మహిళల గ్రాండ్‌స్లామ్‌లో మరో కొత్త తార ఆవిర్భవించింది. 2024 టైటిల్‌ను ఇగా స్వైటెక్(పోలండ్) చేజిక్కించుకోగా.. ఈసారి టైటిల్‌ను 21ఏళ్ల అమెరికా సంచలనం, యువ కెరటం, 2వ సీడ్ కోకో గాఫ్ గెలుచుకుంది. రోలాండ్ గారోస్‌లో జరిగిన మూడుసెట్ల హోరాహోరీ ఫైనల్లో గాఫ్.. టాప్‌సీడ్, బెలారస్‌కు చెందిన అర్యానా సబలెంకపై సంచలన విజయం సాధించింది. తొలిసెట్‌ను టైబ్రేక్‌లో కోల్పోయిన గాఫ్.. ఆ తర్వాత రెండుసెట్లను చేజిక్కించుకొని ఫ్రెంచ్‌ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను తొలిసారి ముద్దాడింది. మూడోసెట్‌లో తొలుత బ్రేక్ పాయింట్ సాధించిన గాఫ్.. ఆ ఆధిక్యతను చివరి వరకు నిలుపుకొని విజేతగా నిలిచింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో గాఫ్ 6-7(5-7), 6-2, 6-4తో సబలెంకను చిత్తుచేసింది. ఈ క్రమంలో రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకోవడంతోపాటు సబలెంకపై ముఖాముఖి పోరులో 6-5 ఆధిక్యతను సంపాదించింది. 2023లో కోకా గాఫ్ తొలిసారి యుఎస్ ఓపెన్ విజేతగా నిలిచి తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకుంది. ఫ్రెంచ్ ఓపెన్ విజేతగా నిలిచిన గాఫ్ టైటిల్‌తోపాటు భారత కరెన్సీలో సుమారు రూ.25కోట్లు, రన్నరప్‌గా నిలిచిన సబలెంక రూ.12.5కోట్లు ప్రైజ్ మనీ అందుకున్నారు.

వీల్‌ఛైర్ విజేత కమిజి

ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల వీల్‌ఛైర్ టైటిల్‌ను యు కమిజి(జపాన్) చేజిక్కించుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో కమిజి 6-2, 6-2తో సుజానే లెన్‌గ్లెన్(నెదర్లాండ్స్)ను చిత్తుచేసింది. కమిజికి ఇది 5వ ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ కాగా.. ఓవరాల్‌గా 10వ గ్రాండ్‌స్లామ్ టైటిల్. 2014, 2017లో యుఎస్ ఓపెన్, 2017, 2020, 2025లో ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ వీల్‌ఛైర్ టైటిళ్లను చేజిక్కించుకుంది. వీరిద్దరూ ముఖాముఖి తలపడడం ఇది 72వ సారి కాగా.. ఇందులో 51సార్లు కమిజి, 21సార్లు సుజానే విజేతగా నిలిచారు.

బాలికల టైటిల్ క్లుగ్‌మన్ కైవసం...

ఫ్రెంచ్ ఓపెన్ బాలికల సింగిల్స్ టైటిల్‌ను ఆస్ట్రేలియాకు చెందిన 17ఏళ్ల లిల్లీ ట్యాగర్ చేజిక్కించుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో లిల్లీ 6-2, 6-0తో 8వ సీడ్ బ్రిటన్‌కు చెందిన క్లుగ్మన్‌ను చిత్తుచేసింది. అరంగేట్రంలోనే ఫ్రెంచ్‌ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను లిల్లీ చేజిక్కించుకోవడం విశేషం.

నేడు అల్కరాజ్, సిన్నర్ మధ్య టైటిల్ పోరు




పురుషుల సింగిల్స్ టైటిల్ సంగ్రామం ఆదివారం రొలాండ్ గారోస్‌లో జరగనుంది. టాప్-2 ఆటగాళ్ల మధ్య ఈ టైటిల్ పోరు జరగనుంది. టాప్‌సీడ్ జెన్నిక్ సిన్నర్(ఇటలీ), 2వ సీడ్, కార్లోస్ అల్కరాజ్(స్పెయిన్)ల మధ్య ఈ సంగ్రామం జరగనుంది. అల్కరాజ్ డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలో నిలువగా.. టాప్‌సీడ్ సిన్నర్ తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ ఫైనల్‌కు చేరాడు. గత ఏడాది యుఎస్ ఓపెన్, ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌లను సిన్నర్ చేజిక్కించుకొని అద్భుత ఫామ్‌లో ఉన్నాడు.

కోకా గాఫ్ టైటిల్ చేజిక్కించుకుందిలా..

ఫైనల్	: అర్యానా సబలెంక(బెలారస్)పై 6-7(5-7), 6-2, 6-4
సెమీస్	: బోయ్‌సన్(ఫ్రాన్స్)పై 6-1, 6-2
క్వార్టర్స్	: మాడిసన్ కీస్(అమెరికా)పై 6-7(6-8), 6-4, 6-1
ప్రి క్వార్టర్స్	: అలెగ్జాండ్రోవా(రష్యా)పై 6-0, 7-5
మూడోరౌండ్	: బౌజ్‌కోవా(చెక్)పై 6-1, 7-6(7-3)
రెండోరౌండ్	: వెలెంటోవా(చెక్)పై 6-2, 6-4
తొలిరౌండ్	: గడక్కి(ఆస్ట్రేలియా)పై 6-2, 6-2

జ్యోతి యర్రాజికి స్వర్ణం

- తైవాన్ ఓపెన్ అథ్లెటిక్స్‌లో తొలిరోజే భారత్‌కు ఆరు బంగారు పతకాలు



తైపే సిటీ(తైవాన్): ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం నెగ్గిన తెలుగు తేజం జ్యోతి యర్రాజి 10 రోజుల వ్యవధిలోనే మరో బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. తైవాన్ వేదికగా జరుగుతున్న తైవాన్ ఓపెన్ అథ్లెటిక్స్ మీట్‌లో జ్యోతి యర్రాజి 100 మీటర్ల హర్డిల్స్‌లో తనకు తిరుగులేదని చాటుతూ పసిడి వెలుగులు విరజిమ్మింది. శనివారం జరిగిన 100మీ. హర్డిల్స్ ఫైనల్లో చిరుతలా పరుగెత్తిన జ్యోతి 12.99 సెకన్లలోనే లక్ష్యాన్ని చేరుకుంది. జపాన్ అథ్లెట్లు సుకా తెరడా(13.04సెకన్లు), చిసాటో కియోయమ (13.10 సెకన్లు) వరుసగా రెండు మూడు స్థానాల్లో నిలిచి రజత, కాంస్య పతకాలు చేజిక్కించుకున్నారు. ఇక పురుషుల ట్రిపుల్ జంప్‌లో అబ్దుల్లా అబూబాకర్, మహిళల 1500మీ. పరుగులో పూజ కూడా స్వర్ణ పతకాలు కైవసం చేసుకొని మనదేశ కీర్తిని విశ్వవ్యాప్తం చేశారు. పురుషుల ట్రిపుల్ జంప్‌లో అబ్దుల్లా అబూబాకర్ ఫైనల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తూ 16.21 మీటర్ల దూరం దూకి అగ్రస్థానంలో నిలిచాడు.

గతంలో అతడి బెస్ట్.. 17.19 మీటర్లుగా ఉంది. ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో రజతంతో సరిపెట్టుకున్న పూజ ఈసారి పసిడిని పట్టేసింది. 1500మీ. రేసును 4 నిమిషాల 11.63 సెకన్లలో ముగించి భారత్‌కు మరో నాల్గో బంగారు పతకాన్ని ఖాయం చేసింది. ఇక పురుషుల 110మీ. హర్డిల్స్‌లో తేజాస్ సిర్సే 13.52సెకన్లు, మహిళల 4x100మీ. రిలేలో సుధీక్ష, అభినయ, స్నేహ, నిత్యల బృందం 44.07సెకన్లలో గమ్యానికి బంగారు పతకం కైవసం చేసుకున్నారు. ఇక పురుషుల రిలే జట్టు 38.75సెకన్లలో గమ్యానికి చేరి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68